విశ్రాంత ఉద్యోగులు గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి: కలెక్టర్

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: విశ్రాంత ఉద్యోగులు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో మాట్లాడారు. వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి నిర్దుష్టమైన ప్రణాళికలతో అధికారులు పనిచేస్తున్నారని తెలిపారు. జిల్లా కేంద్రంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందిచామన్నారు. జాతీయ మారథాన్ రన్నర్ యార్లగడ్డ వెంకటేశ్వర్లు, రచయిత కృష్ణమూర్తి, రావి వెంకటయ్య, వృద్ధాశ్రమ నిర్వాహకులు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులను సన్మానించారు. కె.నాగేశ్వరరావు, సిహెచ్.కృష్ణయ్య, పీఎస్ఎస్ రెడ్డి, కె.సందీప్, జి.భూషణ్‌రావు, భాస్కర్‌రావు, వెంకటేశ్వరరావు, వెస్లీ, యూసఫ్ పాల్గొన్నారు.

వివరాలు సేకరించండి.. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం పక్కా వివరాలు సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ శాంతికుమారి హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో నిర్వహించిన దృశ్యమాధ్యమ సమావేశానికి కలెక్టరేట్‌లో హాజరయ్యారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. గురువారం నుంచి జిల్లాలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం ఇంటింటి సర్వే చేపట్టాలని ఆదేశించారు. రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపులో పారదర్శకత పాటించాలని సూచించారు. జిల్లాలో సన్న, దొడ్డురకాల బియ్యాన్ని వేర్వేరుగా కొనాలని ఆదేశించారు. డీఎస్‌ఓ పి.రుక్మిణీదేవి, జిల్లా పౌర సరఫరాల సంస్థ అధికారి త్రినాథ్‌బాబు, డీపీఓ చంద్రమౌళి, కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి.పాటిల్

సంస్కృతి అండగా..
పూల పండగ

● నేటి నుంచి బతుకమ్మ సంబురాలు



ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే

విజయ దశమి(దసరా) అంటే తెలంగాణలో గుర్తొచ్చేవి బతుకమ్మ సంబురాలు. ప్రకృతిలో చెట్టు, చేమ, రాయిరప్పా.. పువ్వూ మొగ్గా.. ఇలా అన్నింటినీ పూజించడం హైందవ సంప్రదాయం. తెలంగాణ ఖ్యాతి, సంస్కృతి, సంప్రదాయంలో పూలను పూజించే, ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ వేడుకలకు విశిష్ట స్థానం ఉంది. ఏటా అశ్వయుజ మాసం శుద్ధ పాడ్యమికి ముందు వచ్చే అమావాస్య రోజు బతుకమ్మ వేడుకలు ప్రారంభమై దుర్గాష్టమి రోజు ముగుస్తాయి. ఈఏడాది అక్టోబర్ 2 నుంచి తొమ్మిది రోజుల పాటు పల్లెలు, పట్టణాల్లో బతుకమ్మ సంబురాలను మహిళలు, యువతులు వైభవంగా నిర్వహించనున్నారు. గౌరమ్మకు పూజలు చేసి తమ కోరికలు ఫలించాలని వేడుకుంటారు. తీరొక్క పూలను సేకరించి అందంగా పేర్చి పండగ విశిష్టత తెలిసేలా రోజూ అందమైన బతుకమ్మలను తయారు చేస్తారు. సాయంత్రం పూట ఒక్కచోటుకు చేరుకొని బతుకమ్మలను దగ్గరగా అమర్చి వాటి చుట్టూ చప్పట్లు కొడుతూ వలయాకారంలో తిరుగుతూ పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ సందడిగా గడుపుతారు.

"బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..", "ఒక్కేసి.. పువ్వేసి చందమామ..", "చిత్తూ చిత్తూల బొమ్మా.. శివుని ముద్దుల గుమ్మా.." అంటూ సాగే పాటల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు వెల్లివిరుస్తాయి. వేడుకల అనంతరం బొడ్డెమ్మతో పాటు బతుకమ్మలను మహిళలు, యువతులు నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువుల్లో నిమజ్జనం చేస్తారు.



తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ

మహాలయ అమావాస్య రోజు ఈ వేడుకలు జరుగుతాయి. ముందురోజే పూలను కోసి వాడిపోకుండా నీళ్లలో వేసి మర్నాడు బతుకమ్మగా పేరుస్తారు. దీనిని ఎంగిలి పూల బతుకమ్మగా కొలుస్తూ తమలపాకులు, తులసి ఆకులను వాయనంగా ఇస్తారు. నువ్వులు, బియ్యం, పిండి నూకలు కలిపి నైవేద్యం తయారుచేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు.

రెండో రోజు అటుకుల బతుకమ్మ

అశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు అటుకుల బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తారు. తంగేడు, గునుగు, బంతి, గడ్డిపూలను సేకరించి గౌరమ్మను పేర్చి సాయంత్రం పూట పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ నిమజ్జనం చేస్తారు. సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో నైవేద్యం తయారుచేసి అమ్మవారికి సమర్పిస్తారు. ప్రసాదంగా అటుకులను పంపిణీ చేస్తారు.

మూడో రోజు ముద్దపప్పు

సీతమ్మ జడ, చామంతి, రామ బాణం వంటి పూలతో బతుకమ్మను పేర్చి ముద్దపప్పు బతుకమ్మగా పూజిస్తారు. ముద్దపప్పు, పాలు, సత్తుపిండి, చెక్కర, పెసలు, బెల్లంతో నైవేద్యం తయారుచేసి సమర్పిస్తారు.

నాలుగో రోజు నానబియ్యం..

గుమ్మడి, మందార పూలతో బతుకమ్మను పేర్చి ఆడిపాడతారు. నానబెట్టిన బియ్యం, పాలు, బెల్లం కలిపి నైవేద్యం చేసి అమ్మవారికి సమర్పిస్తారు.

ఐదో రోజు అట్ల బతుకమ్మ

అట్లు లేదా దోశలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు.

ఆరో రోజు అలిగిన..

అశ్వయుజ పంచమి రోజు అమ్మవారు అలకతో ఉంటుందని నమ్మి బతుకమ్మ ఆటలు ఆడరు. నైవేద్యం సమర్పించరు.

ఏడో రోజు వేపకాయల

బియ్యపు పిండిని బాగా వేయించి వేప పండ్లుగా తయారుచేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు.

ఎనిమిదో రోజు వెన్నముద్దల..

దేవీకి వెన్నతో నువ్వులుండలను చేస్తారు. నువ్వులు, వెన్న లేదా నెయ్యి, బెల్లం కలిపి నైవేద్యంగా అమ్మవారికి సమర్పిస్తారు.

తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ


దుర్గాష్టమి రోజు సద్దుల బతుకమ్మ వేడుకలు జరుపుకొంటారు. ఐదు రకాల నైవేద్యాలు తయారుచేస్తారు. పెరుగన్నం, చింతపండు పులిహోర, నిమ్మకాయ అన్నం, కొబ్బరి అన్నం, నువ్వుల అన్నం వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. చివరి రోజు "పోయిరా బతుకమ్మ.. వెళ్లిరావమ్మా.. మళ్లొచ్చే యాడాది తిరిగి రావమ్మా.." అని వీడ్కోలు పలుకుతారు.

మహాత్ముడి అడుగుజాడలే
అభివృద్ధికి సోపానాలు


ఈనాడు డిజిటల్, కొత్తగూడెం


ప్రపంచ వ్యాప్తంగా 'బాపు' అని పిలవబడే మహాత్మాగాంధీ ఆచరించిన సత్యం, అహింస మార్గాలు ఎందరో నాయకులను ఉన్నతంగా తీర్చిదిద్దటంలో కీలకపాత్ర పోషించాయి. సత్యం, అహింస, ధైర్యం, ఆత్మవిశ్వాసం, పట్టుదల ప్రధాన ఆయుధాలుగా మాతృదేశ బానిస సంకెళ్లను తెంచిన గాంధీజీ జాతిపితగా, మహాత్ముడిగా ఎందరికో ఆదర్శప్రాయుడయ్యారు. ఆయన ముందుచూపు, ఆలోచనలు, వ్యక్తిత్వం కోట్లాది మందికి చుక్కానిగా నిలిచాయి. గ్రామ స్వరాజ్యం, మద్యపాన నిషేధం, సామాన్య జీవనం ఇలాంటివన్నీ ఆచరించిన గొప్ప వ్యక్తి గాంధీజీ..


ఈ రోజు మహాత్ముడి జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.




వివిధ అంశాలపై సర్వే నిర్వహించగా 100 మంది తమ అభిప్రాయాలను పంచుకున్నారిలా..









ఆదర్శం ఆ గ్రామాలు..

దుర్వ్యసనాలు అభివృద్ధికి అవరోధాలుగా మారుతున్నాయి. దేశానికి వెన్నెముకగా నిలవాల్సిన యువత.. మద్యం, ఇతర మత్తుపదార్థాలకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకుంటోంది. పట్టణాలు, గ్రామాలనే తేడాలు లేకుండా మద్యం ఏరులై పారుతోంది. అయితే భద్రాద్రి జిల్లాలోని కరకగూడెం మండలం చిరుమళ్ల, పట్టంవారిగుంపు, ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కొత్తకారాయిగూడెం గ్రామ పంచాయతీల్లో కొన్నేళ్లుగా మద్యపాన నిషేధం అమలవుతుండటం గమనార్హం.

స్వయం కృషితో పల్లెల్లో వెలుగులు

విద్య, వైద్యం, ఆరోగ్యం, ఆదాయసృష్టి, స్వచ్ఛత మొదలైన రంగాల్లో పురోగతి సాధించేందుకు ఉభయ జిల్లాల్లోని కొన్ని గ్రామ పంచాయతీలు కృషి చేస్తున్నాయి. ఆయా ఆదర్శ గ్రామాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పురస్కారాలను అందజేయటం విశేషం. చుంచుపల్లి మండలం గౌతంపూర్, పాల్వంచ మండలం తోగ్గూడెం, కొణిజర్ల పంచాయతీలు గతేడాది ప్రజారోగ్యం, మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ, ఇంకుడుగుంతల నిర్మాణం వంటి విభాగాల్లో జాతీయ, రాష్ట్రస్థాయిల్లో సత్తాచాటాయి. ఖమ్మం జిల్లాలోని కల్లూరు, భద్రాద్రి జిల్లాలోని అశ్వాపురం పంచాయతీలు చెత్త నుంచి సంపదను సృష్టిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాయి. కొన్ని నెలలుగా పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవటం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవటంతో పాలన గాడితప్పుతోంది.

స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు

గాంధీజీ సిద్ధాంతాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా 15 రోజులుగా ఉభయ జిల్లాల్లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీటిని మహాత్ముడి జయంతితో ముగించనున్నారు. ఇందులో భాగంగా పర్యావరణ కాలుష్యానికి కారణమవుతున్న ప్లాస్టిక్ నిషేధం అమలుకు పూనుకుంటున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఇంకుడుగుంతల నిర్మాణాలకు వీలుగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా అమలయ్యేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో శ్రమదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన పంచాయతీలకు పురస్కారాలు అందజేయనున్నారు.

ఎకో టూరిజంతో స్థానికులకు ఉపాధి కల్పిస్తాం: సీఎఫ్ఓ


పార్కులో ట్రెక్కింగ్ చేస్తున్న సీఎఫ్‌వో భీమా

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: కిన్నెరసానిలో ఎకో టూరిజంను ఏర్పాటుచేసి స్థానికులకు ఉపాధి కల్పించేలా కృషిచేస్తామని సీఎఫ్ఓ భీమా పేర్కొన్నారు. కిన్నెరసాని జింకల పార్కు స్వర్ణోత్సవాలను మంగళవారం నిర్వహించారు. అక్కడి వాచ్ టవర్‌ను ఆయన ప్రారంభించారు. ట్రెక్కింగ్ చేస్తూ అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. దుప్పులకు మంచి ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. పర్యాటకులను ఆకర్షించేందుకు కిన్నెరసాని రిజర్వాయర్‌ను అన్నివిధాలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. కిన్నెరసాని అభయారణ్యం లోగోను ఆవిష్కరించారు. డీఎఫ్ఓ కిష్టాగౌడ్, ఎఫ్‌డీఓ బాబు, దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్, కవిత మాధూరి, ఎఫ్‌బీఓ రాములు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

కొత్తగూడెం విద్యావిభాగం: నేటి నుంచి 2024 డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని డీఈఓ ముమ్మడి వెంకటేశ్వరాచారి అన్నారు. ఈనెల 5 వరకు కొత్తగూడెం పట్టణం పోస్టాఫీసు సెంటర్‌లోని సింగరేణి కాలరీస్ హైస్కూల్‌లో 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలన సాగుతుందన్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 వరకు ఉంటుందని పేర్కొన్నారు. 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల చరవాణులకు సందేశాలు/మెయిల్ వస్తుందన్నారు. అభ్యర్థులు చెక్‌లిస్టు స్వదస్తూరితో పూర్తిచేసుకుని, అన్ని రకాల విద్యార్హత పత్రాలతో హాజరుకావాలని సూచించారు. 10 కౌంటర్లు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ప్రదర్శిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక పరిశీలకునిగా శ్రీనివాసచారి నియమితులయ్యారని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

ఏరియా కమిటీ దళ సభ్యుడి లొంగుబాటు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ బి.రోహిత్‌రాజు

కొత్తగూడెం నేరవిభాగం: ఆళ్లపల్లి మండలం అడవిరామారానికి చెందిన నిషేధిత మావోయిస్టు పార్టీకి పనిచేస్తున్న ఏటూరునాగారం-మహదేవపూర్ ఏరియా కమిటీ దళ సభ్యుడు మడకం ఇడుమ్య అలియాస్ మహేశ్(22) పోలీసుల ఎదుట మంగళవారం లొంగిపోయినట్లు ఎస్పీ బి.రోహిత్‌రాజు తెలిపారు. కొత్తగూడెంలోని తన కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. మడకం ఇడుమయ్య 15 ఏళ్ల క్రితం కరిగుండెం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి ఆళ్లపల్లి మండలం అడవిరామారం గ్రామానికి వలస వచ్చినట్లు తెలిపారు. అడవిరామారంలో మూడోతరగతి వరకు చదువుకున్నాడు. కొన్నేళ్లు వ్యవసాయ కూలీగా పనిచేసిన అనంతరం గతేడాది జనవరి 30న తనకు సోదరుడైన పూనెం ఇడుమయ్య అడవిరామారం అనే వ్యక్తితో కలిసి టీఎస్‌సీఎం దామోదర్ సమక్షంలో నిషేధిత మావోయిస్టు పార్టీలో సభ్యుడిగా చేరాడు. మావోయిస్టు పార్టీకి వ్యతిరేకంగా పోరాడి హక్కులను కాపాడుకోవాలని, తమ ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆదివాసీ గ్రామాల ప్రజలను కోరారు. లొంగిపోయి సాధారణ జీవనం గడపాలనుకునే దళ సభ్యులు తమ కుటుంబీకుల ద్వారా, స్వయంగా తమ దగ్గర్లోని పోలీస్ స్టేషన్లలో లొంగిపోవాలని సూచించారు. లొంగిపోయే దళ సభ్యులకు జీవనోపాధి, పునరావాసం కల్పించడం కోసం ప్రభుత్వం తరపున అందాల్సిన అన్నిరకాల ప్రతి ఫలాలను అందించడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుందని చెప్పారు. ఇప్పటికే అనేక మంది నిషేధిత మావోయిస్టు పార్టీ నాయకులు, సభ్యులు తమ పార్టీ ప్రజలలో ఆదరణ కోల్పోయిందని గ్రహించాలన్నారు. ఈ సిద్ధాంతాలు విజయం సాధించలేవని తెలుసుకుని ప్రశాంత జీవతం గడపాలని నిర్ణయించుకుని అనేక మంది పోలీసుల సమక్షంలో లొంగిపోతారని చెప్పారు.

గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితులకు శిక్ష పడాలి

కొత్తగూడెం నేరవిభాగం: నిషేధిత గంజాయి అక్రమ రవాణా కేసులలో ఉన్న నిందితులకు శిక్ష పడేలా కృషిచేయాలని ఎస్పీ బి.రోహిత్‌రాజు సూచించారు. పెండింగ్‌లో ఉన్న గంజాయి కేసులపై పోలీసు అధికారులతో సమీక్ష సమావేశాన్ని కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దళారుల మాటలు నమ్మొద్దు

కొత్తగూడెం సంక్షేమ విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని మధ్య దళారులు చెప్పే మాటలు నమ్మవద్దని జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొరుగు సేవల(ఔట్ సోర్సింగ్) కమిటీ గుర్తింపులేని ఏజెన్సీలు, కొందరు దళారుల మాయమాటలు చెప్పి సొమ్ము వసూలు చేస్తున్నారనే సమాచారం కలెక్టర్ దృష్టికి వచ్చిందని మోసగాళ్ల మాటలు నమ్మి నష్టపోవద్దన్నారు. దళారుల సమాచారం పోలీసులకు అందించాలని సూచించారు. మోసపూరితంగా వ్యవహరించే వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రైతుసంఘ పోరాట ఫలితంగానే ఆయిల్‌పాం ధర పెరుగుదల

దమ్మపేట: రైతు సంఘం తరపున రెండేళ్లుగా చేసిన పోరాటం వల్లే ఆయిల్‌పాం గెలల ధర పెరిగిందని ఆయిల్‌పాం రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్ అన్నారు. అల్లిపల్లిలో మంగళవారం మాట్లాడారు. పామాయిల్‌పై దిగుమతి సుంకం ఎత్తివేయటంతో రైతులకు జరుగుతున్న అన్యాయంపై ఈఏడాది ఫిబ్రవరిలో అప్పటి కేంద్ర మంత్రిని కలిసినట్లు తెలిపారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఈ అంశాన్ని ప్రస్తుత కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసి రెండుసార్లు వినతిపత్రాలు ఇచ్చారన్నారు. స్పందించిన కేంద్ర ప్రభుత్వం పామాయిల్ దిగుమతిపై సుంకం విధించిందన్నారు. గుత్తా రాజా, దొడ్డా ప్రసాద్, కొయ్యల అచ్యుతరావు, కేవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

కేటీపీఎస్ సందర్శన

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్‌ను టీఎస్ జెన్కో సివిల్ డైరెక్టర్ అజయ్ మంగళవారం సందర్శించారు. ఐదు, ఆరు, ఏడు దశల్లో కొనసాగుతున్న సివిల్ పనుల పురోగతిని పరిశీలించారు. కర్మాగారం సీఈలు వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లుకు దిశానిర్దేశం చేశారు. ఎస్ఈ యుగపతి, ఈఈ రవీందర్ పాల్గొన్నారు.

◆ సివిల్ డైరెక్టర్‌ను కేటీపీఎస్ అతిథి గృహంలో టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చారుగుండ్ల రమేశ్ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు కలిశారు. విద్యుత్తు కేంద్రంలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలను విన్నవించారు.

ఆశల పంటలపై నీళ్లు..
పరిహారమందక కన్నీళ్లు!


కూసుమంచి మండలం భగత్‌వీడు వద్ద వరద ఉద్ధృతికి దెబ్బతిన్న వరి పైరు (పాత చిత్రం)

ఈటీవీ, ఖమ్మం: భారీ వర్షాలు, వరదల ధాటికి అన్నదాతలు పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయారు. పంట నష్టపరిహారం అందటంలో జాప్యమవుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. పంటలు దెబ్బతిన్న రైతులకు రూ.10 వేల చొప్పున అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే. ఇప్పటికే జిల్లాల వారీగా పంట నష్టపోయిన రైతుల వివరాలు ప్రభుత్వానికి అందినా పరిహారం సొమ్ము.. ఖాతాల్లో జమకాకపోవటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మళ్లీ పంటల సాగుకు కాసింత అవకాశమున్నా.. పెట్టుబడులకు చేతిలో చిల్లిగవ్వ లేక సర్కారు సాయం వైపు దీనంగా ఎదురుచూస్తున్నారు.

ఉభయ జిల్లాల్లో..

ఈఏడాది ఆగస్టు 30, 31, సెప్టెంబర్ 1న భారీ వర్షాలు, వరదల ధాటికి 33 శాతం కన్నా ఎక్కువ పంటలు నష్టపోయిన రైతుల వివరాలు సేకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక సర్వే నిర్వహించింది. ఖమ్మం జిల్లాలో 27,219 మంది రైతులు 27,908 ఎకరాల్లో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2,148 మంది 2,656 ఎకరాల్లో వివిధ పంటలు నష్టపోయినట్లు అధికారులు గుర్తించారు. ఖమ్మం జిల్లాలో అత్యధికంగా ఖమ్మం గ్రామీణం, ముదిగొండ, ఎర్రుపాలెం, కూసుమంచి, మధిర, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, చింతకాని, బోనకల్లు మండలాల్లో సుమారు 21వేల మంది రైతులు 24,500 ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు తేల్చారు. పంట నష్టం నివేదికను వారం క్రితం ప్రభుత్వానికి అందజేశారు.

నెల దాటినా

వరి సాగుకు ఎకరాకు రూ.30వేలు, పత్తికి రూ.40వేలు, మిర్చికి రూ.50వేలను రైతులు వెచ్చించారు. ఇప్పుడు మళ్లీ సాగు చేద్దామంటే పెట్టుబడికి చేతిలో చిల్లిగవ్వ లేక విలవిల్లాడుతున్నారు. సెప్టెంబర్ 2న ఖమ్మం జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించారు. త్వరితగతిన పంట నష్టం అంచనా వేసి బాధిత రైతులకు రూ.10వేల చొప్పున పరిహారమందిస్తామని ప్రకటించారు. సర్వే పూర్తయిన వెంటనే పరిహారం సొమ్ము రైతుల ఖాతాల్లో జమవుతుందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా కల్పించారు. పంటలు నష్టపోయి నెల దాటుతున్నా ఇప్పటికీ పరిహారం అందకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం పండగల కాలమైనా అన్నదాతల ఇళ్లల్లో సందడి కనిపించటం లేదు.

భారీ వర్షాలు, వరదల ధాటికి నష్టపోయిన కర్షకుల వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. త్వరలోనే రైతుల ఖాతాల్లో పరిహారం సొమ్ము జమవుతుంది. అన్నదాతలు ఆందోళనకు గురికావొద్దు.
- పుల్లయ్య, డీఏఓ, ఖమ్మం

మూడెకరాల్లో వరి సాగుచేశాను. రూ.లక్ష వరకు పెట్టుబడులు పెట్టాను. ఆకేరు వరద ఉద్ధృతికి పంటంతా కొట్టుకుపోయింది. మళ్లీ పంట సాగు చేద్దామంటే చేతిలో చిల్లిగవ్వలేదు. ప్రభుత్వ సాయం కొంత ఆసరాగా ఉంటుందనుకున్నా.. నెల దాటుతున్నా ఇంకా అందలేదు.
- బానోత్ సురేష్, కస్నాతండా, ఖమ్మం గ్రామీణం మండలం



పాలేరు ఏటి పక్కన ఆరెకరాల్లో వరి సాగుచేశాను. పంట మొత్తం ఇసుక మేటలు వేయటంతో సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లింది. ఇసుక మేటలు తీయాలంటే అదనంగా ఖర్చవుతుంది. ప్రభుత్వ సాయం సత్వరమందితేనే కొంతైనా మాకు కష్టాలు తప్పుతాయి.
- బదావత్ రవి, హటియాతండా, కూసుమంచి మండలం



దసరాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే

దసరా, బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని టీజీఎస్ ఆర్టీసీ ఖమ్మం రీజియన్‌లో 724 ప్రత్యేక బస్సులను నడపనుంది.



ఈ మేరకు రీజియన్ పరిధిలోని ఏడు డిపోల్లో విస్తృత ఏర్పాట్లు చేసింది. గత అనుభవాల రీత్యా ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగిన ప్రణాళికలు రూపొందించింది. ఈనెల 1 నుంచి 11 వరకు, 13 నుంచి 17 వరకు ఎగువ, దిగువ మార్గాల్లో ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. అలాగే 9వ తేదీ నుంచి 11 వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వివిధ ప్రాంతాలకు.. 13, 14 తేదీల్లో హైదరాబాద్‌కు నిత్యం తిరిగే సర్వీసులకు అదనంగా 100 బస్సులు నడపాలని సన్నాహాలు చేస్తోంది. అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కలిగిన బస్సుల్లో టికెట్ల బుకింగ్ పూర్తైతే ప్రయాణికుల డిమాండ్ మేరకు మరికొన్ని బస్సుల్లో రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించనుంది.

డిపోల వారీగా అదనపు బస్సుల వివరాలు ఇలా..

డిపో	ఎగువ	దిగువ	మొత్తం
ఖమ్మం	130	72	202
మధిర	71	37	108
సత్తుపల్లి	93	47	140
భద్రాచలం	91	49	140
కొత్తగూడెం	41	20	61
మణుగూరు	33	15	48
ఇల్లెందు	17	08	25

ఇతర సమాచారం కోసం ఈ కింద నంబర్లను సంప్రదించాలి

ఖమ్మం నూతన బస్టాండ్	9959225979
ఖమ్మం పాత బస్టాండ్	9959225965
సత్తుపల్లి	9959225990
మణుగూరు	8985361796
కొత్తగూడెం	9959225982
మధిర	7382925289
భద్రాచలం	9959225987


హైదరాబాద్ మార్గంలో 24 గంటల పాటు: సరిరాం, ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్

ఖమ్మం నుంచి హైదరాబాద్ మార్గంలో 24 గంటల పాటు నాన్‌స్టాప్ బస్సులు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశాం. అన్ని మార్గాల్లో ప్రయాణికుల రద్దీని పరిశీలిస్తూ బస్సుల సంఖ్యను పెంచడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రత్యేక బస్సులు నడిపే సమయంలో విధులు నిర్వహించే డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందికి ఆర్టీసీ నుంచే భోజన వసతి కల్పిస్తున్నాం.

శ్రమకు విజయం దాసోహం

ఉపాధ్యాయులు కావాలని కలలుగన్నారు. లక్ష్యం నిర్దేశించుకొని కష్టపడి చదివారు. అనుకున్నది సాధించి మిగతా వారికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. సోమవారం విడుదల చేసిన డీఎస్సీ జాబితాలో ప్రతిభ చూపిన యువత పరిచయమే ఈ కథనం..

లక్ష్యానికి పేద అడ్డుకాదు



జీవితంలో ఉన్నతంగా ఎదగాలనే లక్ష్యం ఉంటే ఏదీ అడ్డుకాదని నిరూపించారు సాతానిగూడెం పంచాయతీ రాజీవ్‌నగర్ తండా నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన ధరావత్ రాంబాబు. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయారు. తండ్రి, ఇద్దరు సోదరుల సంరక్షణలో పెరిగారు. బీకాం, బీఈడీతో పాటు ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. లాక్‌డౌన్ సమయంలో వివాహం చేసుకున్నారు. రెండెకరాలపాటు వ్యవసాయం చేశారు. రెండేళ్ల క్రితం భార్య, బిడ్డను ఇంటి వద్ద ఉంచి హైదరాబాద్‌లో ఆరు నెలల పాటు శిక్షణ పొందారు. అక్కడే వసతి గృహంలో ఉంటూ ఉద్యోగ పరీక్షలు రాశారు. సాంఘికశాస్త్రం విభాగంలో స్కూల్ అసిస్టెంట్‌గా జిల్లా స్థాయిలో 23వ ర్యాంకు కైవసం చేసుకున్నారు.

– కామేపల్లి, న్యూస్‌టుడే

మూడు కొలువుల శ్రావణి



సత్తుపల్లికి చెందిన లైన్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రావు, పద్మావతి దంపతుల కుమార్తె శ్రావణి ఏకంగా మూడు కొలువులు సాధించారు. ఇంటర్ చేస్తున్నప్పుడు తండ్రి మృతి చెందారు. భర్త శ్రీధర్‌బాబు ప్రోత్సాహంతో బీఎస్సీ బీఈడీ పూర్తి చేసి హైదరాబాద్‌లో ప్రైవేటు టీచర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల స్పెషల్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకును సాధించిన శ్రావణి డీఎస్సీలో స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు కైవసం చేసుకున్నారు. స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ విభాగంలో జిల్లాలో రెండో ర్యాంకు సాధించారు. ఎలాంటి శిక్షణ తీసుకోకుండా యూట్యూబ్ క్లాసుల సాయంతో విజయకేతనం ఎగురవేశారు.

– సత్తుపల్లి, న్యూస్‌టుడే



★ తల్లాడ మండలం నూతనకల్ గ్రామానికి చెందిన **తెనాలి నాగేశ్వరరావు** తల్లిదండ్రుల పేర్లు వీరభద్రం-కమల. స్కూల్ అసిస్టెంట్ జీవశాస్త్ర విభాగంలో పదో ర్యాంకు దక్కించుకున్నారు. మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన నాగేశ్వరరావు చిన్నప్పటి నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా పెట్టుకుని చదివారు. కల్లూరు, ఖమ్మంలోని ప్రైవేట్ పాఠశాలల్లో 13 ఏళ్లు టీచర్‌గా పనిచేశారు. ఇటీవల గురుకుల టీజీటీ కొలువు సాధించి ప్రస్తుతం చింతపేట జిల్లా దుబ్బాకలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు.



★ ముద్దునూరు గ్రామానికి చెందిన **గురిజాల గౌరి** తన తల్లి సీత, భర్త రాజేశ్ ప్రోత్సాహంతో రాణించారు. ఎస్జీటీలో 22వ ర్యాంకు దక్కించుకున్న ఆమె ప్రైవేట్ టీచర్‌గా, వాలంటీర్‌గా పని చేశారు. పెళ్లయ్యాక గృహిణిగా ఉంటూనే సమయం వృథా కాకుండా చదువుకొని కొలువు దక్కించుకున్నారు.

– తల్లాడ, న్యూస్‌టుడే

ప్రథమ ర్యాంకర్..



ముత్తగూడెం గ్రామానికి చెందిన జి. నరసింహారావు స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో జిల్లాలో ప్రథమ ర్యాంకు సాధించారు. ఎంఎస్సీ, ఎంపెడ్ పూర్తి చేసి ప్రస్తుతం కాకతీయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేస్తున్నారు. ఇటీవల గురుకుల పరీక్షల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా ఎంపికయ్యారు. నియామక లెటర్ కోసం వేచి చూస్తున్న క్రమంలో డీఎస్సీ ఫలితాల్లో ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ప్రథమ ర్యాంకు వచ్చింది.

– ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే

కూలీకెళ్తూ.. రెండు కొలువులు



ఒక ఉద్యోగ సాధనే కష్టమని భావిస్తున్న తరుణంలో ఈ యువకుడు ఏకంగా రెండు కొలువులు సాధించారు. ఆత్కూరు గ్రామానికి చెందిన ఉయ్యాల ప్రసాద్ ఇటీవల సంక్షేమ వసతి గృహ అధికారిగా జోనల్ స్థాయిలో 37వ ర్యాంకు సాధించారు. డీఎస్సీ ఫలితాల్లో సాంఘిక శాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్ ఓపెన్ కేటగిరీలో 12వ ర్యాంకు లభించింది. ఇతనిది చాలా నిరుపేద కుటుంబం. తండ్రి లేరు. తల్లి కూలీపనులకు వెళ్తూ చదివించింది. తనూ ఇంటివద్ద కూలీ పనులకు వెళ్తూ ప్రభుత్వ కొలువుకు సిద్ధమయ్యారు. నెలల వ్యవధిలో రెండు విజయాలు తన ఖాతాలో వేసుకున్నారు.

– మధిర గ్రామీణం, న్యూస్‌టుడే

ఒకేసారి.. రెండు ఉద్యోగాలు



★ యడవల్లికి చెందిన **బాల నరసింహారావు** తాజా డీఎస్సీలో రెండు ఉద్యోగాలు సాధించారు. స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్)లో జిల్లా స్థాయిలో 14వ ర్యాంకు కైవశం చేసుకున్నారు. ఎస్జీటీలో 50వ ర్యాంకుతో మెరిశారు. 12ఏళ్లుగా సీఆర్పీగా పనిచేస్తున్న నరసింహారావు అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతరం కష్టపడ్డారు. డిగ్రీ చదువుతున్న సమయం నుంచి ఇంటి వద్దనే విద్యార్థులకు ట్యూషన్లు చెబుతున్నారు. 23 ఏళ్ల బోధనానుభవంతోనే ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. ఎలాంటి శిక్షణ తీసుకోలేదని తెలిపారు.



★ గంధసిరికి చెందిన **దారగాని బాబు** మూడో ప్రయత్నంలో విజయం సాధించారు. స్కూల్ అసిస్టెంట్ సాంఘిక శాస్త్ర విభాగంలో ఏడో ర్యాంకు కైవశం చేసుకున్నారు. కొంత కాలం ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. శిక్షణ తీసుకోకుండా ఇంటి వద్దనే ప్రణాళిక ప్రకారం చదువుతూ ర్యాంకు సాధించారు. బాబును కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.

– ముదిగొండ, న్యూస్‌టుడే



★ పేద కుటుంబానికి చెందిన రేమిడిచర్ల గ్రామ యువకుడు **చెన్నంరాజు రామభద్రరాజు** గతంలో రెండుసార్లు ప్రయత్నించి డీఎస్సీ సాధనలో విఫలమయ్యారు. ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఉపాధ్యాయునిగా పనిచేస్తూనే ఈసారి సిద్ధమయ్యారు. గతంలో తీసుకున్న శిక్షణ మెటీరియల్ సద్వినియోగం చేసుకున్నారు. సోషల్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధించారు.



★ రాజులదేవరపాడు గ్రామానికి చెందిన **దుద్దుకూరు కృష్ణవేణి** రైతు కుటుంబంలో జన్మించారు. ఇంటర్ వరకు ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుకుంది. రైల్వే ఉద్యోగి అయిన భర్త మార్త వెంకటేశ్వరరావు ప్రోత్సాహంతో ఇంట్లోనే ఉంటూ డీఎస్సీకి సన్నద్ధమయ్యారు. ఎస్జీటీలో జిల్లా 71వ ర్యాంకు దక్కించుకున్నారు.

– ఎర్రుపాలెం, న్యూస్‌టుడే

జీపీఎస్ ట్రాకర్‌తో.. చర్లలో గద్ద సంచారం..!

చర్ల, న్యూస్‌టుడే: చర్లలో ఆదివారం జీపీఎస్ ట్రాకర్లతో ఉన్న ఓ గద్ద సంచరించిన అంశం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ గద్ద సంచారం స్థానికంగా కలకలం రేపింది. స్థానిక నాయక కాలనీలోని ఏకలవ్య విద్యాలయం సమీపంలోని గుట్ట ప్రాంతంలోకి ఆదివారం వచ్చిన గద్ద ఓ చోట కూర్చుండిపోయింది. అక్కడ నుంచి ఎంతసేపటికీ అక్కడి నుంచి వెళ్లకపోవడంతో అక్కడ పనిచేస్తున్న వారు దానిని గమనించారు. ఆకలితో ఉందని గుర్తించి చికెన్ పెట్టడంతో ఎంచక్కా తింది. కొద్దిసేపటి అనంతరం ఎగిరి వెళ్లిపోయింది. దీని కాళ్లకు కెమెరాతోపాటు, జీపీఎస్ ట్రాకర్ ఉండటంతో అది ఎక్కడినుంచి వచ్చిందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సీఐ రాజువర్మ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఈ విషయం తమ దృష్టికి రాలేదన్నారు.



నాయకకాలనీ గుట్ట ప్రాంతంలో సంచరించిన గద్ద కాళ్లకు జీపీఎస్ ట్రాకర్, కెమెరా

వీడని స్నేహబంధం

ఖానాపురం హవేలీ, న్యూస్‌టుడే: మణుగూరులో పుట్టి పెరిగిన ఆ ముగ్గురు స్నేహితులు ఖమ్మం వచ్చి కాల్వలో గల్లంతయ్యారు. బండారు భరత్(30) మృతదేహం లభ్యమైన విషయం విదితమే.



ప్రసాద్



చల్లా రమేశ్

ఇతనికి భార్య, ఇద్దరు చిన్నపిల్లలున్నారు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. గల్లంతైన చల్లా రమేశ్(38) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ప్రసాద్(27)కు ఇంకా పెళ్లి కాలేదు. ప్రైవేటు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. వీరంతా వయసులో భేదం ఉన్నా అన్నదమ్ముల్లా కలిసి ఉండేవారని.. ఎక్కడికైనా కలిసే వెళ్తారని బంధువులు చెబుతున్నారు. సోమవారం ఆనందంగా గడిపామని.. ఇంతలోనే ఇలా జరిగిందని వారితో పాటు వచ్చిన రొండా వెంకటేశ్వర్లు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బంధువుల్లో సడలని ధైర్యం..: గల్లంతైన వారిలో భరత్‌కు మాత్రమే ఈత రాదని బంధువులు తెలిపారు. మిగిలిన రమేశ్, ప్రసాద్ మంచి ఈతగాళ్లని వారి బంధువులు చెబుతున్నారు. వారిద్దరు బతికే ఉండవచ్చని కుటుంబ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రూ.21.15 లక్షల జరిమానా వసూలు

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే: అక్రమ మద్యం, నాటుసారాకు సంబంధించి 412 కేసులు న్యాయస్థానం ద్వారా పరిష్కారానికి వచ్చాయి. నిందితులు చెల్లించిన జరిమానాల విలువ రూ.21.15 లక్షలు. ఖమ్మం స్టేషన్ 1లో 141, స్టేషన్ 2లో 109, వైరా 48, మధిర 30, సత్తుపల్లి 3, సింగరేణి 26, నేలకొండపల్లి 55 కేసులకు పరిష్కారం లభించింది. ఈ కేసుల్లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో నమోదైన కేసులే అధికంగా ఉన్నాయి.

మైకులో అరుపు.. కోతులు పరుగు..

కోతుల నుంచి పంటలు కాపాడుకునేందుకు రైతులు నానాయాతన పడుతున్నారు. ఊరికో ఆలోచన చేస్తూ కోతులు బెదిరిపోయే విధంగా ఏర్పాటు చేస్తున్నారు. ఏన్కూరు మండలం అక్కినాపురంతండాలో సీతారాములు అనే రైతు పత్తి పొలంలో రోజంతా కాపలా ఉండలేక మైకు ఆలోచన చేశాడు. చిన్న మైకును పొలంలో చెట్టుకు వేలాడదీసి అందులో కుక్కల అరుపులు బిగ్గరగా వచ్చేలా ఏర్పాటు చేశాడు. ఆ అరుపులకు కుక్కలు ఉన్నట్లు భావించి వానరదండు అటువైపుగా రావడం లేదు. వినూత్నంగా ఉన్న ఆ దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది.



– ఏన్కూరు, న్యూస్‌టుడే

ఎట్టకేలకు గంజాయి ధ్వంసం

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే: వివిధ కేసుల్లో పట్టుబడిన 1120.04 కిలోల గంజాయిని మంగళవారం ఉన్నతాధికారుల సమక్షంలో తల్లాడ మండలం గోపాలపేటలోని ఓ పరిశ్రమ భట్టిలో కాల్చేశారు. డ్రగ్ డిస్పోజల్ కమిటీ సభ్యులుగా ఉన్న కమిషనర్ జనార్దన్‌రెడ్డి, సహాయ కమిషనర్ గణేష్, జిల్లా ఆబ్కారీ అధికారి నాగేంద్రరెడ్డి, సహాయ అధికారి వేణుగోపాల్‌రెడ్డి సమక్షంలో గంజాయిని ధ్వంసం చేశారు. ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు దగ్గరుండి పర్యవేక్షించారు. ఇప్పటికే కొలిక్కి వచ్చిన 72 కేసుల్లో పట్టుబడి ఉన్న 1120.04 కిలోల గంజాయిని ధ్వంసం చేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఏడు ఆబ్కారీ స్టేషన్లకు చెందిన 72 కేసుల్లో పట్టుబడిన గంజాయి 1120 కిలోలు ఉండగా ఇందులో సగానికి పైగా ఖమ్మం నగరంలో పట్టుబడిందే ఉంది. ఖమ్మం 1 స్టేషన్ పరిధిలో నమోదైన 40 కేసుల్లో 484.37 కిలోలు, స్టేషన్ 2 పరిధిలోని 15 కేసుల్లో 170.496 కిలోల గంజాయి పట్టుబడింది. నగరం తర్వాత మధిర స్టేషన్ పరిధిలో నమోదైన 9 కేసులకు గాను 224 కిలోలు పట్టుబడింది. ఇప్పుడు కాల్చివేసిన సరకు ఆరునెలల కిందటి వరకు కొలిక్కి వచ్చిన కేసులకు సంబంధించింది. ఇంకా స్టేషన్లలో మరో 700 కిలోల వరకు ఉంటుందనే అంచనాలు ఉన్నాయి.



భట్టిలో గంజాయిని కాల్చేస్తున్న ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు జనార్దన్‌రెడ్డి, గణేష్, నాగేంద్రరెడ్డి

భద్రాద్రి జిల్లాలో గుట్టలుగా సరకు...

ఖమ్మం జిల్లా పరిధి స్టేషన్లలో మగ్గుతున్న గంజాయిని ధ్వంసం చేయగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సుమారు 7 వేల కిలోల గంజాయి ధ్వంసం చేయాల్సి ఉంది. కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లాలోని ఆబ్కారీ ఎస్‌హెచ్‌ఓ స్టేషన్లలో పట్టుబడిన గంజాయి గుట్టలుగా పెరుగుతోంది. కేసులు కొలిక్కి వచ్చే వరకు సంరక్షించడం ఓ సవాలుగా మారింది. ఎట్టకేలకు ఖమ్మం జిల్లాలోని నిల్వలు కొంత వరకు ధ్వంసం చేయగా భద్రాద్రి జిల్లాలోని సరకును ఈనెల 4న చేసేందుకు శాఖ కసరత్తు చేస్తోంది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

◆ ఒకరి పరిస్థితి విషమం

కారేపల్లి, న్యూస్‌టుడే: ఖమ్మం జిల్లాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా మారిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కారేపల్లి మండలం గుట్టకింద గుంపు గ్రామానికి చెందిన భార్యభర్తలు ఉండం సూర్యనారాయణ(50), సుగుణ(45) ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్నారు. ఈక్రమంలో ఆల్యాతండాకు చెందిన దారావత్ రాజు, శ్రీకాకుళం జిల్లాకు చెందిన నక్క వెంకటేశ్(32) ఇద్దరు కారేపల్లి వైపు నుంచి ఇల్లెందు వెళ్తున్నారు. భాగ్యనగర్‌తండా పరిధిలో బొడ్రాసికుంట ఆంజనేయస్వామి ఆలయం ముందు రెండు వాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నారు. ఘటనలో ఒకరి తల మరొకరికి తగిలి తీవ్రగాయాలతో రోడ్డుపై పడ్డారు. తీవ్ర రక్తస్రావం అయి ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన రాజును ఖమ్మంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఎస్సై రాజారామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సూర్యనారాయణ సుగుణ వెంకటేశ్

కర్మలకు వెళ్లి వస్తూ.. కానరాని లోకాలకు

మృతుల దంపతులు వారికున్న నాలుగు ఎకరాల్లో పత్తిసాగు చేస్తూ ఖాళీ సమయాల్లో సూర్యనారాయణ తాపీమేస్త్రీగా పని చేస్తున్నారు. సుగుణ సైతం స్థానిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండి విద్యార్థులకు వడ్డించిన తరువాత వారి చేను పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో వీరి బంధువుల కర్మ కార్యక్రమానికి వెళ్లి పని ముగించుకుని ఇంటికి తిరుగు ప్రయాణం అయ్యారు. 3 కి.మీ దాటితే ఇంటికి చేరే వీరిని విధి మృత్యువడికి చేర్చింది.

కుమారుడు చేదోడువాదోడుగా

సూర్యనారాయణ, సుగుణ దంపతులకు కుమారుడు జ్ఞానేశ్వర్, కూతురు నవ్యశ్రీ ఉన్నారు. కూతురు బీఈడీ చదువుతోంది. కుమారుడు మాత్రం ఇంటర్ వరకు చదివి తండ్రి వ్యవసాయ పనులకు, కుటుంబానికి చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. ఉన్నట్టుండి తల్లితండ్రిని కోల్పోవడంతో అనాథలుగా మిగిలిన ఇద్దరి కన్నీటి రోదనలు మిన్నంటాయి.

కొద్దిరోజుల క్రితమే నిశ్చితార్థం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లాకు చెందిన వెంకటేశ్ కారేపల్లి మండలం ఉసిరికాయపల్లి పరిసర ప్రాంతంలో ఉన్న సింగరేణి సంస్థకు చెందిన సోలార్ ప్లాంట్‌లో సీనియర్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఇదిలా ఉండగా వెంకటేశ్‌కు వారి రాష్ట్రానికి చెందిన ఓ యువతితో కొద్ది రోజుల క్రితమే నిశ్చితార్థం జరిగింది. కొద్ది నెలల్లో పెళ్లి పీటలెక్కాల్సిన యువకుడు మృతితో తోటి ఉద్యోగులంతా దిగాలు చెందారు. రాజు సైతం సోలార్ ప్లాంట్‌లో కాంట్రాక్ట్ పద్ధతిన పనులు చేస్తున్నారు.

విషపురుగు కుట్టి యువకుడి మృతి



తరుణ్

ములకలపల్లి, న్యూస్‌టుడే: నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని విషపురుగు కుట్టడంతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వాపురం గ్రామానికి చెందిన పూనెం తరుణ్(23) ములకలపల్లి మండలం కొమ్ముగూడెం గ్రామంలో బంధువుల ఇంటివద్ద ఉంటూ అటవీశాఖలో ఒప్పంద ప్రాదిపదికన అన్నారం బైస్ క్యాంప్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున ఇంటి వద్ద నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని విషపురుగు కుట్టడంతో హుటాహుటిన పాల్వంచ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుని తల్లి పూనెం నాగేంద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుమందు పిచికారీ చేసి..: పురుగుల మందు పిచికారీ చేసి అస్వస్థతకు గురైన ఓ వ్యక్తి ములకలపల్లి మండలంలో మృతి చెందాడు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపురానికి చెందిన బైటా రాంబాబు(25) గ్రామంలోని ఓ రైతు పొలంలో గతనెల 13న పురుగులమందు పిచికారీ చేశాడు. అదేరోజు సాయంత్రం అస్వస్థతకు గురవడంతో ఖమ్మంకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుని భార్య వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరి వేసుకుని వివాహిత బలవన్మరణం

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉరి వేసుకుని ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటనపై మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కొత్తగూడేనికి చెందిన గుర్తుమూర్తి, పావని(36) దంపతులకు ఇద్దరు పిల్లలు. గురుమూర్తి పక్షవాతం, అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. భర్త అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక పావని తన తల్లిగారింటికి మండలంలోని పల్లెగూడెం గ్రామానికి వచ్చింది. మనస్తాపం చెందిన పావని సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

బసవతారకం ఆస్పత్రిలో మహిళా రోగులకు ఉచిత కన్సల్టేషన్

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో అక్టోబరు 20 వరకు మహిళా క్యాన్సర్ రోగులకు ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. అక్టోబర్ నెలను రొమ్ము కాన్సర్ అవగాహన మాసంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో 'స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్' పేరిట ఈ సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు. అన్ని పనిదినాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కన్సల్టేషన్ ఉంటుందని, మ్యామోగ్రామ్ పరీక్షల్లో 25 శాతం రాయితీ, ఇతర పరీక్షల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు వివరించారు. అదనపు సమాచారం కోసం ఫోన్ నంబర్లు 040-23551235, 23550967ను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా సీతారామ కల్యాణోత్సవం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తిశ్రద్ధలతో సుప్రభాతం పలికి అర్చన చేశారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన రామయ్య ఇక్కడ దర్శనం ఇవ్వడం భక్తులు చేసుకున్న అదృష్టమని వైదిక పెద్దలు ప్రవచించారు. సీతమ్మకు యోక్త్రాన్ని, రామయ్యకు యజ్ఞోపవీతాన్ని ధరింపజేశారు. మాంగల్యధారణ కనుల పండువగా సాగింది.

చండ్రుగొండ: అన్నపురెడ్డిపల్లిలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని మంగళవారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ఈవో రమాదేవి సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయాన్ని ఆమె సందర్శించారు.

గంజాయి స్వాధీనం

ఖమ్మం సారథినగర్: ఆబ్కారీ టాస్క్‌ఫోర్స్ బృందం మంగళవారం నగరంలోని సారథినగర్ పరిసరాల్లో తనిఖీలు జరిపిన క్రమంలో 11.9 కిలోల గంజాయిని తరలించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దర్ని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి మూటలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని స్టేషన్ 2లో కేసు నమోదు చేశారు. డీటీఎఫ్ తనిఖీ సి.ఐ. కరుణశ్రీ, ఎస్సై సరిత సిబ్బంది ఉన్నారు.

ఆయిల్‌పాం రైతుల ధరహాసం

◆ టన్ను రూ.14,392 నుంచి రూ.17,043కు పెంపు

అశ్వారావుపేట, న్యూస్‌టుడే

రెండేళ్ల తరువాత ఆయిల్‌పాం గెలల ధర భారీగా పెరిగింది. టన్నుకు రూ.2651 మేర పెరిగింది. దీంతో ఆయిల్‌పాం రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. 2022 జూన్‌లో టన్ను రూ.23 వేల పైచిలుకు వచ్చిన గెలల ధర ఆనాటి నుంచి దిగజారుతూ అదే ఏడాది అక్టోబరులో రూ.12,996కి తగ్గింది. ఆనాటి నుంచి నేటివరకూ ఆయిల్‌పాం గెలల ధర రూ.14,392కు మించలేదు.

★ 2024 ఆగస్టులో ఎట్టకేలకు టన్ను గెలల ధర రూ.14,392కు పెరిగి రైతులకు ఊరటనివ్వగా సెప్టెంబరు నెలకు ఏకంగా టన్ను గెలల ధర రూ.17043కి చేరింది. దీంతో దసరా బోనాంజాను రైతులు ముందే అందుకున్నట్లుగా భావిస్తున్నారు.



★ రెండేళ్లుగా గిట్టుబాటు ధర కావాలంటూ రైతు సంఘాల వినతిపత్రాలు, కేంద్ర మంత్రులకు విజ్ఞప్తులు చేశారు. గత మూడేళ్లుగా ముడిపామాయిల్‌పై దిగుమతి సుంకం పెంచాలని రైతులు డిమాండు చేస్తూనే ఉన్నారు. సెప్టెంబరులో కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం 20శాతం, సెస్సు, కస్టమ్స్ డ్యూటీ, అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డ్యూటీ అన్నీ కలిపి 27.5శాతానికి పెంచింది. దీంతో ముడిచమురు అమ్మకాలు జోరందుకున్నాయి. ఆ తేడా రైతుల ధరల్లో స్పష్టంగా కనిపించింది. ప్రస్తుత ధర చూస్తే పాత రోజులు పునరావృత్తం అవుతాయా అని రైతులు ఆనంద పడుతున్నారు. ఇందుకు కృషిచేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు, కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

రెండేళ్ల ధరలు ఒక్కసారిగా పరిశీలిస్తే..

నెల	2023	2024
జనవరి	13,781	12,681
ఫిబ్రవరి	13,961	13,135
మార్చి	13,943	14,174
ఏప్రిల్	14,205	14,229
మే	13,346	13,438
జూన్	12,623	13,705
జులై	13,091	13,828
ఆగస్టు	13,026	14,392
సెప్టెంబరు	12,231	17,043
అక్టోబరు	12,196	-----
నవంబరు	12,525	-----
డిసెంబరు	12,534	-----

చికెన్ ధరలు



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్తపత్తి	5,000	7,011	6,700
పాతపత్తి	4,200	7,550	7,400
పెసలు	4,000	7,375	6,100
కందులు	7,500	8,800	8,800
ఏసీ ఎండుమిరప	11,000	20,000	18,000
ఎండుమిరప	10,000	18,500	17,300
ఏసీ తాలుమిరప	8,700	10,000	9,700

భద్రాచలం

• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

మంగళ సూత్రాల వివాదం సమసినట్లేనా..?

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయంలో మంగళ సూత్రాల వివాదం సమసినట్లే తెలుస్తోంది. ఏడేళ్ల కిందట సీతమ్మవారి మంగళ సూత్రాలు, లక్ష్మణుడి బంగారు లాకెట్ కనిపించకుండా పోయాయి. అధికారులు విచారణ చేపట్టారు. కొద్ది రోజుల తర్వాత ఎక్కడ కనిపించకుండా పోయాయో అదే బీరువాలో ఆభరణాలు లభ్యమయ్యాయి. సరిగ్గా వెతకకపోవడం వల్లే గందరగోళం తలెత్తిందని అధికారులు సర్ది చెప్పుకున్నారు. దీని వెనుక మతలబు ఏంటనే కోణంలో కొందరు అప్పట్లోనే లోకాయుక్తను ఆశ్రయించారు. అప్పటి నుంచి హైదరాబాద్ లోకాయుక్త వాయిదాలకు సిబ్బంది వెళ్తున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల కిందట ఇక్కడి ఉద్యోగులు లోకాయుక్త ముందు హాజరైనట్లు సమాచారం. దీనిని లోకాయుక్త కొట్టేసినట్లు ఆలయ వర్గాలు చెబుతున్నాయి. అధికారిక ఉత్వర్వులు వస్తే దీనిపై స్పష్టత లభించనుంది.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలకు అటానమస్ హోదా లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డా. జాన్ మిల్టన్ తెలిపారు. వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం బృందం మంగళవారం భద్రాచలం కళాశాలను సందర్శించి హోదా ధ్రువీకరణ అందజేసింది. ఆ బృందాన్ని కళాశాలలో ఘనంగా సన్మానించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
భద్రాచలం: 79950 67029
అశ్వారావుపేట: 80085 73696
పినపాక: 91212 29033

సమస్య: తుమ్మలచెరువు ప్రాథమికోన్నత పాఠశాల వద్ద తాగునీటి బోరుతో ప్రజలు, పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఎంతో సేపు కొడితే తప్ప నీరు రావడంలేదు. **కుమురంబీం యూత్, తుమ్మలచెరువు**

సమాధానం: బోర్ మెకానిక్‌తో మాట్లాడటం జరిగింది. వెంటనే బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. - **దినేశ్‌కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, తుమ్మలచెరువు**

– అశ్వాపురం, న్యూస్‌టుడే

పరిశుభ్రతతోనే పంచాయతీల్లో అభివృద్ధి సాధ్యం

పినపాక, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతతోనే పంచాయతీల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని పంచాయతీరాజ్ శాఖ అదనపు కమిషనర్ కృష్ణ పేర్కొన్నారు. పినపాక మండలం భూపాల పట్నం పంచాయతీ లోని పచ్చదనం-పరిశుభ్రతలో భాగంగా నిర్వహిస్తున్న పనులను మంగళవారం పరిశీలించారు.



ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ కృష్ణ

ఉత్తమ పంచాయతీ ఎంపిక సంబంధించి సదరు అధికారులు సమర్పించిన దరఖాస్తులో పొందుపర్చిన అంశాలకు సంబంధించిన పనులను తనిఖీ చేశారు. డీఎల్‌పీఓ సుధీర్‌కుమార్, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఏపీఓ వీరభద్రస్వామి, పంచాయతీ కార్యదర్శులు, మాజీ సర్పంచి కృష్ణంరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పామాయిల్ కర్మాగారం ఎదుట లారీ యజమానుల ఆందోళన

దమ్మపేట, న్యూస్‌టుడే: బయటి నుంచి లారీలను తీసుకొచ్చి, స్థానిక లారీలకు కిరాయిలు దక్కకుండా చేస్తున్నారని అప్పారావు పామాయిల్ కర్మాగారం ఎదుట దమ్మపేట లారీ యజమానులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. కర్మాగారంలో గెలల గానుగ అనంతరం వచ్చే పామ్‌కెర్నల్ కేక్‌ను కర్ణాటకకు చెందిన ఓ ప్రైవేటు గుత్తేదారు కొనుగోలు చేస్తున్నారు. దీనిని తరలించేందుకు స్థానిక లారీలను గాకుండా, బయట నుంచి లారీలను తీసుకొస్తున్నారు. దీనిని దమ్మపేట లారీ యజమానులు ఖండించారు. దీనిపై కొద్దిరోజులుగా గుత్తేదారుకు, లారీ యజమానులకు మధ్య వివాదం సాగుతోంది. కర్మాగార మేనేజర్ కల్యాణ్ చొరవతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది.

రాబోయే కాలానికి.. కాబోయే డాక్టరమ్మలు..!

భద్రాచలం, న్యూస్‌టుడే

భద్రాచలం గిరిజన గురుకుల బాలికల కళాశాల మరోసారి తన సత్తా చాటింది. అక్కడ ఇంటర్మీడియట్ చదివిన ఐదుగురు విద్యార్థినులు ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించి విద్యాలయం పేరును మరింత ఇనుమడింపజేశారు. గురుకులం ఆధ్వర్యంలో హైదరాబాద్ హయత్‌నగర్‌లో ఇచ్చిన ఉచిత లాంగ్ టర్మ్ శిక్షణను వారు సద్వినియోగం చేసుకుని ర్యాంకులు సాధించారు. గత ఏడాది ఇద్దరు సీట్లు పొందగా.. ఇదే స్ఫూర్తితో ఇక్కడి ఐటీడీఏ అధికారుల చొరవతో పది మందిని ఎంపిక చేసి ఈ ఏడాది దీర్ఘకాలిక శిక్షణ ఇప్పించారు. వారిలో తొలివిడత కౌన్సెలింగ్‌లో ఐదుగురు విద్యార్థినులు ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. వీరందరివీ నిరుపేద వ్యవసాయ కుటుంబాలే.. తమ విజయంలో ఇక్కడ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించి ఇటీవల బదిలీ అయిన దేవదాస్, అధ్యాపకుల పాత్ర ఎంతో ఉందని వారు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థినులను ప్రస్తుత ప్రిన్సిపల్ పద్మావతి అభినందించారు.

ఎంబీబీఎస్‌కు ఎంపికైన గిరిజన గురుకుల బాలికల కళాశాల విద్యార్థినులు



భద్రాచలం గిరిజన గురుకుల బాలికల జూనియర్ కళాశాల

పట్టుదలతో మళ్లీ చదివా.. వజ్జా వీరకుమారి..



మాది గుండాల మండలం పాలగూడెం. గత ఏడాది నీట్ రాసినా మంచి మార్కులు రాలేదు. పట్టుదలతో మళ్లీ చదివి లక్ష్యం సాధించాను. మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు వచ్చింది. మన్యంలో సేవ చేయాలన్నది నా జీవితాశయం.

క్రమశిక్షణతో చదివితే.. పూనెం గీతాంజలి



మాది ములుగు జిల్లా వెంకటాపురం గ్రామం. బైపీసీలో 944 మార్కులు సాధించాను. గురుకులం ఆధ్వర్యంలో అందించిన ఉచిత శిక్షణ వల్ల ఇప్పుడు గద్వాల్‌లో ఎంబీబీఎస్ సీటు పొందాను. క్రమశిక్షణతో చదివితే విజయం దక్కుతుంది.

పల్లెలో సేవ చేస్తా.. కర్ర చైతన్య

మాది నారాయణ్‌ఖేడ్. గద్వాల్‌లో మెడికల్ సీటు వచ్చింది. ఇంటర్‌లో 954 మార్కులు రావడంతో ఎంబీబీఎస్ సాధించాలనే తపన పెరిగింది. మొదటిసారి రానప్పటికీ నిరుత్సాహం రానీయలేదు. డాక్టర్ పట్టా వచ్చిన తర్వాత పల్లెల్లో సేవ చేస్తాను. ఈ అవకాశాన్ని వరంగా భావించి పేద ప్రజలకు సత్వర వైద్యం అందిస్తా. ఎంబీబీఎస్ అనేది ఓ హోదాగానే కాకుండా బాధ్యత అని నమ్ముతా.



ప్రయత్నాన్ని వీడలేదు.. కుడుముల సాత్విక..

మాది ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం దూతారం గ్రామం. ఇంటర్మీడియట్‌లో 920 మార్కులు వచ్చాయి. 2021-22లో మొదటి ప్రయత్నంలో ర్యాంకు రాలేదు. రెండోసారీ అనుకున్న స్థాయి మార్కులు రాలేదు. మూడో ప్రయత్నంలో హైదరాబాద్‌లోని మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాను. మారుమూల ప్రాంతాలకు వైద్య సేవలు అందించడం నాకిష్టం.



నా కల నిజమైంది.. ఇర్ప అమృతరాణి

మాది గుండాల మండలం సాయనపల్లి గ్రామం. ఇంటర్‌లో 976 మార్కులు వచ్చాయి. మా కుటుంబంలో అక్క బేబీ ప్రసన్న ప్రస్తుతం ఎంబీబీఎస్ చదువుతోంది. అదే ఉత్సాహంతో నేను చదివాను. చిన్నప్పటి నుంచి డాక్టర్ కావాలన్నది నా కల. క్రమశిక్షణగా చదివితే పేద వాళ్లు కూడా వైద్య రంగంలో సీట్లు సాధించ వచ్చనే నమ్మకం నాకుంది. అది నిజమైంది.



కలుపుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

దమ్మపేట, న్యూస్‌టుడే: కలుపుమందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్వారిగూడెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కె.సత్యనారాయణ(48) మంగళవారం సాయంత్రం కలుపుమందు తాగాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు.

ఐఈడీ బాంబులు నిర్వీర్యం

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: చత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లా కస్తుమెట, మొహిండి, హక్‌పాడ్ గ్రామాల రహదారుల్లో మూడు చోట్ల మావోయిస్టులు ఐదు కిలోల చొప్పున 15 కిలలో బరువున్న ఐఈడీ బాంబులను అమర్చారు. మంగళవారం కూంబింగ్ చేపట్టిన భద్రతా బలగాలు వీటిని గుర్తించి బాంబు డిస్పోజల్ స్క్వాడ్ సాయంతో వెలికి తీసి నిర్వీర్యం చేశారు.

రామాలయంలో వ్యక్తి హల్‌చల్

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయంలో సోమవారం రాత్రి ఓ వ్యక్తి హల్‌చల్ చేయడంతో అతడిని పోలీసులకు అప్పగించారు. ఓ వ్యక్తి నిత్యం దర్శనానికి వచ్చి మామిడి తోరణాలు కట్టి దైవసేవ చేస్తుంటాడు. ఆయన సోమవారం సాయంత్రం ఆలయంలోని ఓ చిరుద్యోగిపై దురుసుగా ప్రవర్తించాడు. ఇదేమని గట్టిగా మందలించడంతో అదే రోజు రాత్రి ఓ రెగ్యులర్ ఉద్యోగిపైనా దాడికి యత్నించాడు. ఎంతచెప్పినా వినకపోవడంతో ఆలయ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు కౌన్సెలింగ్ చేసి బయటకు పంపేశారు.

అత్తవారింటి ఎదుట ఆందోళన

బూర్గంపాడు, న్యూస్‌టుడే: అత్తింటి వారు తనను వేధింపులకు గురి చేస్తున్నారని తనకు తగిన న్యాయం చేయాలని కోరుతూ వారి ఇంటి ఎదుట వివాహిత ఆందోళన చేపట్టిన ఘటన సారపాకలో మంగళవారం చోటుచేసుకుంది. గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన యువతికి సారపాకకు చెందిన కామేశ్వరరావుతో 2013లో వివాహమైంది. సారపాకలో నివాసం ఉంటున్నారు. తనను అత్తింటి వారు వేధింపులకు గురి చేస్తున్నారని నిరసనకు దిగింది. న్యాయం జరిగేవరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించింది. మహిళా సంఘాల నాయకులు ఘటనాస్థలికి చేరుకుని బాధితురాలితో మాట్లాడారు. బాధితురాలిని పోలీస్ ఠాణాకు తీసుకెళ్లి తగిన న్యాయం చేయాలని పోలీసులను కోరారు. యువతి భర్తను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఎస్సై రాజేశ్ తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దేవదానం

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మాజీ ఏపీపీ కోటా దేవదానం మంగళవారం ఎన్నికయ్యారు. కార్యక్రమానికి భద్రాచలం ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. సీనియర్ న్యాయవాది మాదిరెడ్డి రమణారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో దేవదానంచే సీనియర్ న్యాయవాది శ్రీమన్నారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. ఉపాధ్యక్షురాలిగా ఎంవి రమణ, ప్రధాన కార్యదర్శి పూసల శ్రీనివాసాచారి, సంయుక్త కార్యదర్శిగా విద్యాధరి, కోశాధికారిగా బండారు రమేష్ ఎన్నికయ్యారు.

పినపాక తహసీల్దార్‌గా నరేశ్ బాధ్యతల స్వీకరణ

పినపాక, న్యూస్‌టుడే: పినపాక తహసీల్దార్‌గా అద్దంకి నరేశ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పినపాక తహసీల్దార్‌గా పని చేసిన సూర్యనారాయణపై సస్పెన్షన్ వేటు పడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో నూతన తహసీల్దార్‌గా నరేశ్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు.

నాయీ బ్రాహ్మణ సంఘం కమిటీ ఎన్నిక

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం కమిటీ ఎన్నిక భద్రాచలంలో మంగళవారం జరిగింది. పట్టణ అధ్యక్షుడిగా వల్లాజి కుమారస్వామి, కార్యదర్శిగా ఎస్.నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వి.రఘునాథబాబు, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్, కోశాధికారిగా ఉపేందర్ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

తిరుమల లడ్డు కల్తీ దోషులను శిక్షించాలని నిరసన ప్రదర్శన

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: తిరుమల లడ్డు కల్తీలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేస్తూ అశ్వారావుపేటలో హైందవ రక్షణ సమితి, ఆర్యవైశ్య సంఘం, వాసవిక్లబ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి ప్రదర్శనగా వివేకానంద కూడలికి చేరుకొని నినాదాలు చేశారు.

'మెరుగైన తపాలా సేవలు అందించండి'

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన తపాలా సేవలు అందించాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి పోస్టల్ సిబ్బందిని ఆదేశించారు. దుమ్ముగూడెం, కమలాపురం సబ్ పోస్టాఫీసులను ఆయన మంగళవారం సందర్శించారు. అనంతరం ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

గోపాలమిత్రల అవగాహన సమావేశం

అశ్వాపురం, న్యూస్‌టుడే: అశ్వాపురంలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో భద్రాచలం డివిజన్ గోపాలమిత్రల అవగాహన సమావేశం మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పశు సంవర్ధక శాఖ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యనిర్వహణ అధికారి డాక్టర్ కొర్లకుంట కిశోర్ హాజరయ్యారు.

ట్రస్టు చేయూతతో కాలువ పూడికతీత

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలో అంజుబాక దగ్గర తాలిపేరు కాలువ పూడికతీత పనులను యలమంచి సీతారామయ్య ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. కొంత కాలంగా కాలువ పూడిపోయి రైతుల పొలాలకు సాగునీరు సరఫరా కావడంలేదని తెలుసుకున్న సీతారామయ్య ట్రస్టు ప్రతినిధి యలమంచి శ్రీనుబాబు స్వయంగా ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. జేసీబీతో పూడికతీత పనులు చేయించారు.

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలని సీపీఐ ధర్నా

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలని డిమాండు చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో అశ్వారావుపేటలో ధర్నా నిర్వహించారు. సీపీఐ జిల్లా నాయకులు సయ్యద్ సలీం మాట్లాడుతూ అశ్వారావుపేట రెవెన్యూ సర్వేనంబరు 1228లో పేదలు నివాసం ఉంటున్నారని, వారందరికి ఇళ్లపట్టాలు ఇవ్వాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

గ్రామనీటి సహాయకుల శిక్షణ ముగింపు

అశ్వారావుపేట: మిషన్ భగీరథ నీరు ప్రతి వీధికి అందేలా చూసే బాధ్యత గ్రామ నీటి సహాయకులదేనని భగీరథ ఇంట్రా డీఈఈ సలీం అన్నారు. నాలుగు రోజుల పాటు జరిగిన గ్రామ నీటి సహాయకుల శిక్షణ మంగళవారం ముగిసింది. శిక్షణలో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు అందజేశారు.

సరైన సమయంలో టీకాలు అందించాలి

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: అర్హులైన పిల్లలను గుర్తించి సరైన సమయంలో టీకాలు అందించాల్సిన బాధ్యత ఆశా కార్యకర్తలదేనని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి బాలాజీనాయక్ అన్నారు. మణుగూరు పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

చెరువుల్లో ప్లాంట్ బోట్లు వదిలివేత

అశ్వారావుపేట గ్రామీణం: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని నారంవారిగూడెం, ఊట్లపల్లి, నారాయణపురం, వినాయకపురం, ఆసుపాక, నందిపాడు చెరువుల్లో మంగళవారం ఫ్లోటింగ్ ప్లాంట్ బోట్లను వదిలారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ బోట్లలోని మొక్కల వేర్లు నీటిలోకి వెళ్లి కలుషితంగా ఉన్న చెరువు నీటిని శుద్ధి చేస్తాయన్నారు.

ప్రమాదకర మలుపుల పరిశీలన

చంద్రుగొండ, న్యూస్‌టుడే: మండలంలోని తిప్పనపల్లి, అయ్యనపాలెం, మద్దుకూరు, చంద్రుగొండ వద్ద జాతీయ రహదారి మలుపు ప్రాంతాలను ఎస్ఐ స్వప్న, ర.భ.శాఖ ఏఈ లఖన్ నాయక్‌లు మంగళవారం పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో నివారణ చర్యలపై నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు తెలిపారు.

క్రీడలతోనే చక్కటి ఆరోగ్యం: ఎమ్మెల్యే

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: క్రీడలతోనే యువత చక్కటి ఆరోగ్యవంతులుగా ఉంటారని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. ములకపాడు క్రీడా మైదానంలో టాలెంట్ క్రికెట్ లీగ్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా మంగళవారం ప్రారంభించారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. సీఐ అశోక్, ఎస్సై గణేష్, సీతమ్మ, నాయకులు పాల్గొన్నారు.



దుమ్ముగూడెం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

భద్రాచలం పట్టణం: భద్రాచలం పట్టణంలోని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ ఆధ్వర్యంలో 16 మంది వయోవృద్ధులను ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సన్మానించారు. సంఘం అధ్యక్షుడు బంధు వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు. ✦ భద్రాచలంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బతుకమ్మ వేడుకలకు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు హాజరై ప్రసంగించారు.

బూర్గంపాడు మండలంలో ఎమ్మెల్యే విస్తృత పర్యటన

బూర్గంపాడు, న్యూస్‌టుడే: బూర్గంపాడు మండలంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఉప్పుసాక, పినపాక పట్టినగర్, అంజనాపురం, మోరంపల్లిబంజర, సోంపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రహదారులను ప్రారంభించారు.



పరిహారం చెక్కును అందిస్తున్న పాయం వెంకటేశ్వర్లు

వేపలగడ్డ పంచాయతీలో ఐటీసీ ఆధ్వర్యంలో నిర్మించిన బస్ షెల్టరుకు ప్రారంభోత్సవం చేశారు. గత నెలలో భారీ వర్షాలకు ఉర్లదోసపల్లిలో పశువులు కొట్టుకుపోయి నష్టపోయిన రైతులకు పరిహారం చెక్కులను అందించారు. 17 మంది రైతులకు రూ.15.39 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో జమలారెడ్డి, దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బట్టా విజయ్‌గాంధీ, మహమ్మద్‌ఖాన్, లక్ష్మీనారాయణరెడ్డి, రమేశ్, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు



చంద్రుగొండలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: దసరా సెలవుల నేపథ్యంలో పాఠశాలలకు చివరి రోజైన మంగళవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులతో బతుకమ్మ ఆడారు. అశ్వారావుపేట జడ్పీహెచ్ఎస్‌లో వేడుకలను ప్రధానోపాధ్యాయురాలు హరిత ప్రారంభించారు.

దమ్మపేట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సెయింట్ మేరీస్, గీతాంజలి, ఎయిమ్ మోడల్ పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు మంగళవారం సందడిగా నిర్వహించారు. చిన్నారులు, మహిళా ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా సాగాయి. చంద్రుగొండ, గుర్రాయిగూడెం, సెయింట్ జోసెఫ్, ప్రతిభ పాఠశాలల్లో సంబురాలు నిర్వహించారు. స్థానిక చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

పినపాక: నియోజకవర్గంలో బతుకమ్మ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు రంగురంగుల పూలను సేకరించి అందంగా బతుకమ్మను పేర్చారు.

అశ్వాపురం: గొందిగూడెంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సందడిగా ముందస్తు బతుకమ్మ సంబురాలు చేశారు.



కరకగూడెం జడ్పీ పాఠశాలలో బతుకమ్మలతో ఉపాధ్యాయినులు, విద్యార్థులు

ఆళ్లపల్లి: మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం బతుకమ్మ సంబురాలు సాగాయి.

కరకగూడెం: జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉపాధ్యాయులు స్రవంతి, సుజాత, గౌసియా బేగం పాల్గొన్నారు.

మణుగూరు: మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థినులు మహిళా ఉపాధ్యాయుల సహకారంతో తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చుతూ ఆడి పాడారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా భద్రాచలం ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాలలో సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. డా. పాల్‌రాజ్ ఇంజనీరింగ్ విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని మంగళవారం రక్తదానం చేశారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులతో ఆసుపత్రి వైద్య సిబ్బంది

అశ్వాపురం: రక్తదానం ప్రాణదానంతో సమానమని భారజల ప్లాంట్ జీఎం ఎస్.జగ్గారావు అన్నారు. భద్రాచలం రెడ్‌క్రాస్ సొసైటీ రక్తకేంద్రం, భారజల ప్లాంట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం గౌతమీనగర్‌లో భారజల ప్లాంట్ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. భారజల ప్లాంట్ డీజీఎంలు హెచ్‌కే శర్మ, జగన్నాథశర్మ, జి.శ్రీనివాసరావు, భారజల ప్లాంట్ ఆసుపత్రి వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరిగూడెంలో విషవాయువుపై అవగాహన సదస్సు

అశ్వాపురం, న్యూస్‌టుడే: కుమ్మరిగూడెం గ్రామాన్ని భారజల ప్లాంట్ భద్రత, పర్యావరణ విభాగం అధికారులు మంగళవారం సందర్శించారు. ఇటీవల హైడ్రోజన్ సల్ఫైడ్ విషవాయువు వాసనతో కుమ్మరిగూడెం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో గ్రామంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. విషవాయువు విడుదలయితే తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను వివరించారు.

సింగరేణి ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చాలి

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: సింగరేణి ఆర్థికస్థితిని మెరుగుపర్చాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు డిమాండ్ చేశారు. మణుగూరులోని ఓసీ 2లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వమూ గత ప్రభుత్వ విధానాలను అనుసరిస్తున్నట్లు కనబడుతోందన్నారు. వెంకటరత్నం, శ్రీనివాసు, లక్ష్మణ్‌రావు, రామ్మూర్తి పాల్గొన్నారు.

జూద స్థావరంపై దాడి

చంద్రుగొండ, న్యూస్‌టుడే: అన్నపురెడ్డిపల్లి మండలం పెంట్లం గ్రామంలో జూద స్థావరంపై మంగళవారం అన్నపురెడ్డిపల్లి ఎస్ఐ చంద్రశేఖర్ దాడి చేసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2300 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

గుట్కా పొట్లాలు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

చంద్రుగొండ, న్యూస్‌టుడే: సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లికి చెందిన దోసపాటి మురళీకృష్ణ గుట్కాలు తీసుకొచ్చి అన్నపురెడ్డిపల్లిలో విక్రయిస్తున్నాడన్న సమాచారంతో అతనిని పట్టుకొని నిషేధిత గుట్కా పొట్లాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో వార్డెన్ మృతి

గుండాల, న్యూస్‌టుడే: గుండాలలోని గిరిజన బాలికల వసతిగృహంలో వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్న కుమారి(55) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆమె కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఎస్సై రాజమౌళి కేసు నమోదు చేశారు.

వాగు పొంగితే.. దూరమే..!

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే

చిన్నపాటి వరదకే ఆ చప్టా నీట మునుగుతోంది. దీంతో పలు గ్రామాల గిరిజనులు అవస్థలు పడక తప్పని దుస్థితి. అశ్వారావుపేట - అనంతారం రహదారిలో వాగొడ్డుగూడెం సమీపంలో ఉన్న వాగుపై పదేళ్ల క్రితం లోలెవల్ చప్టాను నిర్మించారు. ఊట్లపల్లి సమీపంలోని వెంకమ్మ చెరువు ఎగువ భాగంలో ఉన్న అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో వర్షం కురిస్తే చెరువు అలుగు నుంచి వచ్చే వరద నీరు వాగులోకి చేరి అది ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో వాగుపై ఉన్న లోలెవల్ చప్టా నీట మునిగి రాకపోకలు నిలిచిపోతున్నాయి. హైలెవల్ వంతెన నిర్మించి ఇబ్బందిని తొలగించాలన్న గిరిజనుల విన్నపాలు పట్టించుకునే వారే కరవయ్యారు. దీంతో నాలుగు కిలోమీటర్ల దూరానికి చుట్టూ తిరిగి పది కి.మీ. ప్రయాణించాల్సి వస్తోంది. అనంతారం, గాండ్లగూడెం, పండువారిగూడెం, దిబ్బగూడెం, రామన్నగూడెం, వాగొడ్డుగూడెం, వాగొడ్డుగూడెం కాలనీ, గంగారం కాలనీలకు చెందిన గిరిజనులతోపాటు మారుమూల ప్రాంతంలో ఉన్న కావడిగుండ్ల, కన్నాయిగూడెం, కంట్లం, గోపన్నగూడెం, గోగులపూడి, చెన్నాపురం వాసులు వేదాంతపురం, ఊట్లపల్లి మీదుగా పది కిలోమీటర్ల దూరం చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది.



చిన్నపాటి వర్షానికే నీటి మునిగిన వాగొడ్డుగూడెం లోలెవల్ చప్టా

తరచూ అగచాట్లే.. కుంజా లక్ష్మి, వాగొడ్డుగూడెం



ఎగువ ప్రాంతంలో చిన్నపాటి వర్షం కురిస్తే చాలు ఈ వాగులోకి వరద చేరి చప్టా నీట మునుగుతోంది. వరద తగ్గేవరకు వేచి చూడాల్సిందే. లేదంటే అశ్వారావుపేట వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సిందే. ఈ వాగుపై ఎత్తైన వంతెన నిర్మించాలి.

పంటలు నీట మునుగుతున్నాయి : వెంకటేశ్వర్లు, వాగొడ్డుగూడెం కాలనీ



వాగుపై ఉన్న లోలెవల్ వంతెనకు ఏర్పాటు చేసిన గొట్టాలు ఇసుకతో పడిపోయి నీళ్లు ప్రవహించక వాగు పరిసరాల్లోని పంట పొలాలు నీట మునుగుతున్నాయి. గిరిజన రైతులు నష్టం పోతున్నారు. రాకపోకలూ నిలిచిపోయి జనం ఇబ్బంది పడుతున్నారు. పాలకులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోయింది.

సమస్యను గుర్తించాం : శ్రీధర్, పంచాయతీరాజ్ శాఖ డీఈఈ, అశ్వారావుపేట

ఈ సమస్యను గుర్తించాం. ఇప్పటికే ఈ అంశాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇక్కడ ఎత్తైన వంతెన నిర్మాణానికి అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు పంపిస్తాం.

కొత్తగూడెం

• కొత్తగూడెం • ఇల్లెందు

పంచాయతీ కార్యదర్శులకు సన్మానం



పంచాయతీ కార్యదర్శి రణధీర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ జితేశ్ వి.పాటిల్

ఇల్లెందు గ్రామీణం, టేకులపల్లి, న్యూస్‌టుడే: ఎకో బ్రిక్స్ అధిక సంఖ్యలో తయారు చేయించి, పర్యావరణహితం కోసం శ్రమించిన పోలారం, టేకులపల్లి పంచాయతీ కార్యదర్శులు రణధీర్, ఉప్పు దీప్తిని కలెక్టర్ జితేశ్ సత్కరించారు. కలెక్టరేట్‌లో ప్రశంసాపత్రాన్ని మంగళవారం అందజేశారు.

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రతి రోజు మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్న సింగరేణి కార్మికుడు నుర్వి రాజశేఖర్‌ను ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్'లో అభినందించిన సందర్భంగా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆయనను మంగళవారం తన ఛాంబర్‌లో సన్మానించారు.

ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనకు విద్యార్థులు నడుం బిగించాలి: కలెక్టర్



విద్యార్థులు ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు చేసిన పరికరాలను ఆసక్తిగా తిలకిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనకు విద్యార్థులు నడుం బిగించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ పిలుపునిచ్చారు. 'స్వచ్ఛ భారత్ - స్వచ్ఛతా హీ సేవా-2024' కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి తయారు చేసిన పరికరాలను, కళాకృతులను కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రదర్శించారు. వీటిని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆసక్తిగా తిలకించారు. విద్యార్థులను అభినందించారు. సమావేశంలో డీఆర్‌డీఓ పీడీ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

★ ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 58 మంది వారి ప్రదర్శనలను ఏర్పాటు చేయగా పాఠశాల స్థాయిలో టేకులపల్లి మండలం సులానగర్ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని ఎన్.మనస్విని ప్రథమ, రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు విద్యార్థిని సాయి హరిత ద్వితీయ, చంద్రుగొండ మండలం పోకలగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి బి.ధనుష్ తృతీయ బహుమతి గెలుపొందారు.

★ ఎకో బ్రిక్స్ తయారీలో.. జిల్లాలో 21 గ్రామ పంచాయతీల్లో 58,581 ఎకోబ్రిక్స్ తయారు చేశారు. వీరిలో బూర్గంపాడు మండలంలోని సారపాక పంచాయతీ అత్యధికంగా 2,050 ఎకో బ్రిక్స్ తయారు చేసింది. ద్వితీయ స్థానంలో సుజాతనగర్, మూడో స్థానంలో లక్ష్మీదేవిపల్లి మండలాల వారు తయారు చేశారు. ఆయా మండలాల ఎంపీడీఓలు, ఏపీఓలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందించి ఘనంగా సత్కరించారు.

రుచులు ఆస్వాదించేలా.. లాభాలు ఆర్జించేలా..!

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

ఇల్లెందు పట్టణంలోని యూనియన్ బ్యాంకు, పెట్రోల్‌బంక్ సినిమా థియేటర్ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకుకు అవసరాల నిమిత్తం వస్తుంటారు. హోటళ్లు అందుబాటులో లేవు. ఉన్నచోట్ల ధరల భారంతో వివిధ వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అల్పాహారాలు..

మహిళా సాధికారతే లక్ష్యంగా స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికాభ్యున్నతి సాధించేందుకు ప్రభుత్వం ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్లను ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే కలెక్టరేట్ ప్రాంగణంలో స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో క్యాంటీన్ ఏర్పాటైంది. ఇల్లెందు, టేకులపల్లి తదితర మండలాల్లోని రద్దీ ప్రాంతాల్లో క్యాంటీన్ల ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

★ ఇల్లెందులోని యూనియన్ బ్యాంకు సమీపంలో సుభాష్‌నగర్‌కు చెందిన పద్మావతి స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో క్యాంటీన్ తరహాలో ఏర్పాటు చేశారు. రూ.30కే గోంగూర రైస్, టమాట రైస్, పులిహోర, పెరుగు అన్నం, అరటిపండు అందిస్తున్నారు. అల్పాహారం ధరకే భోజనం లభించటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

★ టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాలకు చెందిన స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న అల్పాహారం కేంద్రాన్ని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ కలెక్టరేట్‌లో సోమవారం ప్రారంభించి అభినందనలు తెలిపారు. పచ్చళ్లు, పిండి వంటకాలను తయారుచేసి అల్పాహారం కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. రద్దీ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాలకు రుణమందించి ప్రోత్సహించాలని నిర్వాహకులు కోరుతున్నారు.



ఇల్లెందు యూనియన్ బ్యాంకు వద్ద స్వయం సహాయక సభ్యుల క్యాంటీన్

ఇల్లెందులో అరటి లేదా ఆకులతో లభించే విస్తరి, స్టీలు పళ్లెం, స్టీలు చెంచాలు వినియోగించి ప్లాస్టిక్ రహితంగా అల్పాహారం అందించేందుకు ప్రయత్నిస్తాం. రూ.30కి అల్పాహారంతో పాటు అరటి పండు అందిస్తున్నాం. ఆర్థిక ప్రయోజనం కలుగుతుండటంతో స్వయం సహాయక సభ్యులు ఆనందపడుతున్నారు. – దుర్గారావు, ఏపీఎం

డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా

పాల్వంచ, న్యూస్‌టుడే: పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా కల్పిస్తూ వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం డీఎన్ సీడీసీ రామచంద్రన్ మంగళవారం ఉత్తర్వులను కళాశాల ప్రిన్సిపల్ పద్మకు అందజేశారు. కళాశాల న్యాక్ ఏ గ్రేడ్ కావడంతో హోదా కల్పించినట్లు పేర్కొన్నారు. కళాశాల అభివృద్ధిపథంలో నడిపించాలని సూచించారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కొత్తగూడెం: 8008573723
పాల్వంచ: 9550076766
ఇల్లెందు: 9154846689

సమస్య: రాజీవ్‌పార్కులో పిచ్చిమొక్కలు, గడ్డి విపరీతంగా పెరిగిపోయాయి. నడక సాధన చేయడానికి ఇబ్బందికరంగా మారింది. పైగా పాముల పుట్టలున్నాయి. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం సమయంలో విషసర్పాలకు భయపడాల్సి వస్తోంది. సెలవులు ప్రారంభమైన నేపథ్యంలో అధికారులు స్పందించి పార్కును శుభ్రం చేయించాలి. - వాకర్స్

పరిష్కారం: పార్కులో చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. పార్కులో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి విషసర్పాలకు అవకాశం లేకుండా శుభ్రం చేయించే ప్రక్రియను చేపడతాం.

- వేముల ప్రసాద్‌బాబు, కౌన్సిలర్
కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

బతుకమ్మ కూడళ్లలో సౌకర్యాలు కల్పించండి: కూనంనేని

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: మహిళలు బతుకమ్మలను ఆడే కూడళ్లలో సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారులను మంగళవారం ఎమ్మెల్యే కూనంనేని ఆదేశించారు. మున్సిపల్ వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, స్థానిక పెద్దల సహకారంతో బతుకమ్మ ఆడే సెంటర్లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, విద్యుత్తు, తాగునీరు మొదలైన సదుపాయాలు కల్పించాలన్నారు. మహిళల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు.

అర్థవంతంగా.. వ్యర్థం ఉపయోగం



ఖాళీ బాటిల్‌తో అందంగా అలంకరించి మొక్కలకు పాదుగా ఏర్పాటు చేసి రక్షణ కల్పించారు. సుజాతనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇటీవల మొక్కలు నాటారు. మొక్క కుదురులకు ఖాళీ సీసాలను అందంగా కత్తిరించి రంగుల మట్టిని నింపి మొక్కల చుట్టూ పాదుగా చేశారు. మొక్కకు రక్షణ కల్పిస్తూ అందంగా కనిపిస్తుంది. – సుజాతనగర్, న్యూస్‌టుడే

లీకేజీకి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు



పాల్వంచ పురపాలకంలో తాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతున్న అంశంపై 'ఈనాడు'లో ప్రచురితమైన 'తలాపున నీరున్నా.. తడారిన గొంతుకలు' కథనానికి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ స్పందించారు. పాల్వంచ పురపాలక కమిషనర్‌కు లీకేజీలపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ సంబంధిత లీకేజీలను స్వయంగా పరిశీలించారు. జారీ లీకేజీలను తక్షణమే మరమ్మతులు చేపట్టేలా ప్రణాళిక రూపొందించారు. – పాల్వంచ, న్యూస్‌టుడే

పండగొచ్చింది.. సందడి తెచ్చింది

సరదాలు పంచే దసరా వచ్చేసింది. బడి పిల్లలకు సెలవులు తెచ్చింది. అందుకే తమ ఇళ్లకు వెళ్లేందుకు వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో చదివే పిల్లలు అన్నీ సర్దుకుని సెలవులకు ఇంటికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. దీంతో వసతి గృహాల వద్ద సందడి నెలకొంది. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను తీసుకెళ్లేందుకు ఆయా వసతి గృహాలు, పాఠశాలల వద్దకు చేరుకున్నారు. జూలూరుపాడు మండలం పడమటినర్సాపురం ఆశ్రమ పాఠశాల, జూలూరుపాడులోని ఎస్సీ బాలుర వసతి గృహం, కస్తూర్బాగాంధీ విద్యాలయంలో చదువుతున్న వందలాది మంది విద్యార్థులు దుస్తులు, పుస్తకాలు సర్దుకుని తమ సొంత ఊళ్లకు పయనమయ్యారు. ఈ క్రమంలో పడమటినర్సాపురం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల గేటు వద్ద మంగళవారం తమ పిల్లలను తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు ఇలా అనుమతి కోసం ఎదురు చూస్తుండగా, మరో వైపు బాలికల వివరాలను సిబ్బంది నమోదు చేసుకుంటున్న దృశ్యాలను 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. – జూలూరుపాడు, న్యూస్‌టుడే



టీవీ, రాత పుస్తకాల వితరణ

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: మారుమూల ప్రాంత ప్రజలకు సేవలందిస్తామని చేతన ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు వెనిగళ్ల వెంకటేశ్వరరావు తెలిపారు. కొమరారం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు ఫౌండేషన్ సహకారంతో టీవీ, 300 మంది విద్యార్థులకు రాత పుస్తకాలను మంగళవారం అందజేశారు. ఉమర్‌సింగ్‌తండా ప్రధానోపాధ్యాయులు సత్యలాల్, అంజమ్మ, సీతారామయ్య, నవీన్‌యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రీసర్వే చేయాలని డిమాండ్

టేకులపల్లి, న్యూస్‌టుడే: గంగారం రెవెన్యూ పరిధిలోని 6 సర్వే నంబర్ భూములను సమగ్రంగా సర్వే చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు రేపాకుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సంపత్‌నగర్, మిట్టపల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి కందగట్ల సురేందర్, పాయం వెంకన్న పాల్గొన్నారు.

ఎంఈఓ వెంకటేశ్‌కు సన్మానం

జూలూరుపాడు, న్యూస్‌టుడే: జూలూరుపాడు మండల విద్యాధికారిగా పదేళ్లు పని చేసి కామేపల్లి మండలం బదిలీపై వెళ్లిన గుగులోత్ వెంకటేశ్‌ను మంగళవారం జూలూరుపాడు మండల వనరుల కేంద్రంలో సిబ్బంది, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఎమ్మార్సీ సిబ్బంది నిరోషా, ప్రవీణ్, బేబి, పద్మ, శ్రీను, సాంబశివరావు, ఉపాధ్యాయులు బాస్కర్, దేవేందర్, బాలకిషన్, గోపాల్, జేత్రం పాల్గొన్నారు.

డీఎస్సీ కొలువులు సాధించిన ఉద్యోగులు



కోటేశ్వరరావు



తిరుపతిరావు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇల్లెందు మండలం సంజయనగర్‌కు చెందిన కొవిల కోటేశ్వరరావు డీఎస్సీ సోషల్ జిల్లాలోనే మొదటిర్యాంకు సాధించారు. స్కూల్ అసిస్టెంట్ సోషల్ పోస్టులో 77.47 స్కోరును కైవసం చేసుకున్నారు. కోటేశ్వరరావు ఇప్పటికే ఇల్లెందు మైనారిటీ గురుకులంలో టీజీటీ సోషల్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రూపు-1 ప్రిలిమ్స్, గ్రూపు-4లో ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికయ్యారు. బాలాజీనగర్ పంచాయతీ కార్యదర్శి గుంటి తిరుపతిరావు డీఎస్సీ ఎస్‌జీటీలో బీసీ-బీ విభాగంలో ఏడో ర్యాంకు సాధించారు. ఈ విభాగంలో 25 పోస్టులున్నాయి.

కరకట్ట నిర్మించాలని డిమాండ్

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: బుగ్గవాగు పరీవాహక ప్రాంతం పొడవునా కరకట్ట నిర్మించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేశ్ డిమాండ్ చేశారు. సీపీఎం దోనెంబర్ బస్తీ, ఇల్లెందుపహాడ్, సత్యనారాయణపురం గ్రామశాఖల సమావేశాల్లో మంగళవారం మాట్లాడారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు-సత్యనారాయణపురం మధ్య హైలెవల్ వంతెన నిర్మించాలని కోరారు. నబీ, ఖాదర్, పద్మ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

అప్పుల నుంచి విముక్తి కల్పించండి

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: బ్యాంకు అప్పుల నుంచి రైతులకు విముక్తి కల్పించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ అనుబంధ రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్ర వెంకన్న, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఆవుల కిరణ్ కోరారు. ఇల్లెందులోని ఎంఎల్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన రైతు కూలీ సంఘం సమావేశంలో మాట్లాడారు. పార్టీ పట్టణ కార్యదర్శి యాకుబ్‌షావలి పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా-24 కార్యక్రమంలో భాగంగా పురపాలకంలో ఇటీవల నిర్వహించిన వేస్ట్ టూ ఆర్ట్ క్రియేషన్ ప్రోగ్రాంలో పాల్గొన్న విద్యార్థులకు పురపాలక సమావేశ మందిరంలో మంగళవారం బహుమతులు అందజేశారు. స్థానిక వార్డు కౌన్సిలర్ అఫ్జల్ ఇన్షాబేగం, మేనేజర్ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అశోక్‌చౌహాన్, వీరభద్రాచారి, వావ్ ప్రతినిధి పి.రవి తదితరులు పాల్గొన్నారు.

చదరంగంలో విద్యార్థి ప్రతిభ

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయంలో సెప్టెంబరు 29, 30న జరిగిన చదరంగం ఆల్ ఇండియా పోటీల్లో కొత్తగూడెం పట్టణం ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థి గణేశ్ ప్రథమ స్థానం సాధించాడని కళాశాల యాజమాన్యం మంగళవారం తెలిపింది. కళాశాలలో గణేశ్‌ను అభినందించారు.

విజేతలకు సన్మానం

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: మిస్టర్ కోలిండియాగా ఎంపికైన ఎం.రామకృష్ణను, పబ్లిక్ సెక్టార్‌కు ఎంపికైన పవన్‌ను, మన్వితను ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు రజాక్ మంగళవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాగమోహన్, భీముఏడు, అనంతరామయ్య, బాలు, సత్తార్, యాకుబుద్దీన్, సంగారావు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు బతుకమ్మ వేడుకలు



కొత్తగూడెం సింగరేణి: బతుకమ్మలతో కళాశాల సిబ్బంది

కొత్తగూడెం పట్టణం, కొత్తగూడెం కలెక్టరేట్, సుజాతనగర్, కొత్తగూడెం సింగరేణి, చుంచుపల్లి, టేకులపల్లి, న్యూస్‌టుడే: కొత్తగూడెం పట్టణం, సుజాతనగర్, టేకులపల్లి మండలాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం బతుకమ్మ ఆటపాటలతో అలరించారు. తెలంగాణ సంప్రదాయ ఆటపాటలతో ఆనందంగా నృత్య ప్రదర్శన చేశారు. సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం బతుకమ్మ ఆడారు. కళాశాల ఆవరణలో బతుకమ్మలను పేర్చి అధ్యాపకులు, సిబ్బంది బతుకమ్మలను ఆడారు. కళాశాల ప్రిన్సిపల్ చింతా శారద తదితరులు పాల్గొన్నారు. గౌతంపూర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. హెచ్.ఎం.చంద్రశేఖర్‌రావు, మధుసూదన్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాల్వంచ, న్యూస్‌టుడే: పాల్వంచలోని పలు విద్యాలయాల్లో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. రామవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాలను ఎంఈఓ ప్రభుదయాళ్ అధ్యక్షతన చేపట్టారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని ఎస్‌జీ విద్యా సంస్థల కొత్తగూడెం రీజనల్ ఇన్‌ఛార్జి సతీష్ సూచించారు. ★ బూడిదగడ్డ బస్తీలోని 'ఆర్యన్స్' స్కూల్లో చిన్నారులు దేవతామూర్తుల రూపాల్లో అలరించారు.

జూలూరుపాడు, న్యూస్‌టుడే: పాఠశాలల్లో మంగళవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి బతుకమ్మలను పేర్చి ఆవరణలో ఆడిపాడారు. జూలూరుపాడు, వినోభానగర్, గుండెపూడి, కాకర్ల, పాపకొల్లు తదితర పాఠశాలల్లో విద్యార్థులు పూలను సేకరించి తెచ్చారు. మహిళా ఉపాధ్యాయులు పిల్లలతో కలిసి సందడి చేశారు.



గౌతంపూర్ పాఠశాలలో బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు

ఇల్లెందు పట్టణం, న్యూస్‌టుడే: సాంస్కృతిక చిహ్నం బతుకమ్మ పండగ అని ఇల్లెందు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వై.చిన్నయ్య తెలిపారు. బతుకమ్మలతో అధ్యాపకులు, విద్యార్థులు మంగళవారం సందడి చేశారు. టి.ప్రభాకర్‌రావు, బి.నాగేశ్వర్‌రావు, శ్రీదేవి, పి.కృష్ణవేణి, బి.నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.



టేకులపల్లిలో..



జూలూరుపాడు మండలం వినోభానగర్‌లో..

భూతగాదాలో ఒకరిపై కేసు

టేకులపల్లి, న్యూస్‌టుడే: భూతగాదాల నేపథ్యంలో తొమ్మిదో మైలుతండాకు చెందిన భూక్య రాములు అదే గ్రామానికి చెందిన భూక్య సరోజ, బానోత్ శ్రావణిపై రాయితో దాడి చేశారని ఎస్సై పోగుల సురేష్ మంగళవారం తెలిపారు. సరోజ కుమారుడు వినోద్ ఫిర్యాదు మేరకు రాములుపై కేసు నమోదు చేశామన్నారు.

మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న భాజపా: సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కనకయ్య

జూలూరుపాడు, న్యూస్‌టుడే: కేంద్రంలోని భాజపా ప్రభుత్వం మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోందని, ఆ ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా అధ్యక్షుడు అన్నవరపు కనకయ్య అన్నారు. గుండెపూడిలో బానోత్ మధు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ మహాసభలో ఆయన మాట్లాడారు. దేశంలో నిరుద్యోగం, అవినీతి, ధరలు పేదరికం పెరిగిపోయిందని, పేదలు మరింత పేదలుగానే ఉండిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో నల్లధనాన్ని వెలికి తీసి పేదలకు పంచుతామని చెప్పిన భాజపా పెద్దలు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గార్యంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందన్నారు. రుణమాఫీ కేవలం 25శాతం రైతులకు మాత్రమే జరిగిందన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి జిల్లాకు నీరందించాలని, ఇతర ప్రాంతాలకు తరలించడంపై ఉద్యమించేందుకు రైతాంగం సిద్ధం కావాలన్నారు. అంతకుముందు పార్టీ పతాకాన్ని వల్లమల సంజీవరావు ఎగురవేశారు. సీతారాం ఏచూరి ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల కార్యదర్శి యాసా నరేశ్, చందర్‌రావు, సుగుణ, కనకరత్నం, భద్రు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోల్‌ప్లే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీనివాస్

టేకులపల్లి, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి రోల్‌ప్లే పోటీల్లో టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం.తేజస్వి, నిహారిక, వెన్నెల, నజీబా, నందిని ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులను పాఠశాలలో ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. గైడ్ టీచర్‌గా ఎం.రవీందర్, సీహెచ్ పద్మావతి వ్యవహరించారు.

అండర్-14 క్రికెట్ జట్టుకు ఎంపిక: టేకులపల్లి, న్యూస్‌టుడే: భద్రాచలంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా అండర్-14 క్రికెట్ జట్టుకు కోయగూడెం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న జర్పుల నిహాల్ ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయుడు అమర్‌సింగ్, ఉపాధ్యాయులు నిహాల్‌ను మంగళవారం అభినందించారు.

నల్లబ్యాడ్జీలతో ఏఈఓల నిరసన

కొత్తగూడెం వ్యవసాయం, న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారని ఏఈవో జేఏసీ జిల్లా అధ్యక్షుడు బి.నరింహారావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన డిజిటల్ క్రాప్ క్లస్టర్ సర్వే ఏఈవోలు చేయటం కష్టతరమైందన్నారు. ప్రభుత్వం 5వేల ఎకరాలకు(ఒక క్లస్టర్) ఒక ఏఈవోను నియమించాలని, కానీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 128 మంది ఏఈవోలు అవసరం ఉండగా కేవలం 67 మందితోనే పని చేయించడం భారమన్నారు. ప్రభుత్వం స్పందించే వరకు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని తెలిపారు.

సుజాతనగర్, న్యూస్‌టుడే: సుజాతనగర్ మండల వ్యవసాయ విస్తరణాధికారులు డిజిటల్ క్రాప్ సర్వేకు వ్యతిరేకంగా మంగళవారం సుజాతనగర్ రైతువేదిక వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఈఓల జేఏసీ నాయకులు నర్సింహారావు మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రనూశ, శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.



జూలూరుపాడు: నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన ఏఈవోలు

జూలూరుపాడు, న్యూస్‌టుడే: కేంద్రం తీసుకొచ్చిన డిజిటల్ క్రాప్ సర్వేకు సహాయకులను నియమించకుండా ఏఈఓలపై ఒత్తిడి తీసుకొస్తున్నందుకు నిరసనగా మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి వ్యవసాయ విస్తరణాధికారులు విధులకు హాజరయ్యారు. జూలూరుపాడు మండలంలోని ఆయా క్లస్టర్లలో పనిచేస్తున్న ఏఈవోలు తమ నిరసన వ్యక్తం చేశారు. వ్యవసాయాధికారి దీపక్‌ఆనంద్, ఏఈఓలు గోపీకృష్ణ, గౌస్, లావణ్య, విజయభాను తదితరలు పాల్గొన్నారు.

తానొకటి తలిస్తే..

జూలూరుపాడు, న్యూస్‌టుడే: ఆ యువ జంట ఉన్నత విద్యనభ్యసించారు.. పోటీ పరీక్షలు రాస్తూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇల్లు గడవాలంటే ప్రైవేటు ఉద్యోగం చేయక తప్పదని భావించి రెండేళ్ల క్రితం కొత్తగూడెంలోని ఓ వస్త్ర దుకాణంలో యువకుడు ఉద్యోగంలో చేరాడు. భార్యతో కలిసి కొత్తగూడెంలో ఉంటూ ఉద్యోగ ప్రయత్నం చేస్తూ భార్యభర్తలు బలవన్మరణం పొందిన ఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

జూలూరుపాడు మండలం సాయిరాంతండాకు చెందిన హలావత్ విద్య, నాగమ్మ దంపతులకు అయిదుగురు సంతానం. వీరిలో ముగ్గురు కూతుళ్లు. ఇద్దరు కుమారులు. అందరికంటే చిన్నవాడు రత్నకుమార్. బీఎస్సీ టీటీసీ పూర్తి చేశాడు. అతడికి అదే గ్రామానికి చెందిన పార్వతితో 2016లో వివాహం జరిగింది. యువతి కూడా బీఎస్సీ బీఈడీ చదివింది. వీరికి సంతానం కలుగలేదు. ఇద్దరు ఉన్నత విద్యావంతులు కావడంతో ఉద్యోగం కోసం అనేక ప్రయత్నాలు చేశారు. పోలీసు, డీఎస్సీ ఉద్యోగాలకు సంబంధించిన పరీక్షలు రాస్తూ వస్తున్నారు. తన తండ్రి ఇచ్చిన ఎకరంన్నర పొలంతో పాటు అత్తగారు ఇచ్చిన మరో ఎకరం భూమి మాత్రమే ఉంది. తమ కాళ్లపై



గుండెలవిసేలా రోదిస్తున్న కుటుంబ సభ్యులు

తాము నిలబడాలనే సంకల్పం వారిని ఉద్యోగ వేటలో పడేలా చేసింది. ఈ నేపథ్యంలోనే కొత్తగూడెంలోని ఓ వస్త్ర దుకాణంలో రత్నకుమార్ చేరాడు. అక్కడే పరిచయం అయిన వ్యక్తి ద్వారా సింగరేణిలో ఉద్యోగం వస్తుందని ఆశ చూపడంతో నగదు ఇచ్చి మోసపోయాడు. అప్పులు చేసి, వడ్డీలకు తెచ్చిన డబ్బంతా దళారి చేతిలో పెట్టినట్లు కుటుంబ సభ్యులు వాపోతున్నారు. చివరకు అటు ఉద్యోగం రాక, ఇటు ఇచ్చిన డబ్బులు తిరిగి రాకపోవడంతో కొలువు కల తీరకపోగా, మోసపోయామని గ్రహించిన దంపతులు ఇద్దరు మనో వేదనతో మరణ శాసనం లిఖించుకున్నారు.

యువకుడు పురుగు మందు తాగినట్లు గ్రహించిన భార్య ఆమె కూడా తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లగా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు చికిత్స కోసం హైదరాబాద్ తరలించినా ఫలితం లేకపోయింది. యువదంపతులు మృతి చెందడంతో సాయిరాంతండాలో కంటతడి పెట్టని వారు లేరు. అందరితో ఎంతో సౌమ్యంగా ఉండే రత్నకుమార్ దంపతులు మృతి చెందడంతో అటు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. స్వగ్రామం తరలించిన వీరి భౌతికకాయాలను చూసేందుకు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో జనం చేరుకున్నారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

బొగ్గు ఉత్పత్తి అంతంతే..!

కొత్తగూడెం సింగరేణి, ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆగస్టు మాసంలో 84 శాతం మాత్రమే బొగ్గును ఉత్పత్తి చేసిన సింగరేణి.. సెప్టెంబర్‌లో కేవలం 72 శాతానికే పరిమితమైంది. సెప్టెంబర్ మాసంలో ఉత్పత్తి పుంజుకోవాలని ఉన్నతస్థాయి యాజమాన్యం చేసిన సూచనలు ఫలించినట్లు కనిపించటం లేదు. ఆగస్టులో కేవలం మూడు ఏరియాలు మాత్రమే ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించగా అందులో రెండు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోనివి కావటం గమనార్హం. సెప్టెంబరులో కేవలం ఒకే ఒక్క ఏరియా లక్ష్యాన్ని సాధించింది. అదీ ఇల్లెందు కావటం విశేషం. ఇల్లెందు ఏరియా 123 శాతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించింది. ఆగస్టులో 43,67,487 టన్నులకు గాను కేవలం 36,53,778 టన్నులను ఉత్పత్తి చేసిన సింగరేణి సెప్టెంబరులో 51,99,500 టన్నులకు గాను 36,46,891 టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది.

ఇల్లెందు అదరహో.. ఆగస్టులో మిగిలిన ఏరియాల కన్నా అత్యధిక శాతం లక్ష్యాన్ని సాధించిన ఇల్లెందు ఏరియా సెప్టెంబరులోనూ సత్తా చాటింది. ఆగస్టు మాసంలో 128శాతం, సెప్టెంబరులో 123 శాతం లక్ష్యాన్ని సాధించింది. తర్వాత స్థానంలో కొత్తగూడెం ఏరియా నిలుస్తోంది. కొత్తగూడెం ఏరియాలో 87శాతం ఉత్పత్తి లక్ష్యం పూర్తయింది. మణుగూరు ఏరియా 62 శాతం లక్ష్యాన్ని సాధించింది. మూడు నెలలుగా ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించని వివిధ ఏరియాలు కనీసం అక్టోబరు నెలలోనైనా పుంజుకోని పక్షంలో వార్షిక లక్ష్యాన్ని చేరుకోవటం దుర్లభంగా మారే ప్రమాదముంది.



ఆరు నెలల వ్యవధిలో.. సింగరేణి సంస్థ ఆరు నెలల వ్యవధిలో కేవలం 90శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని మాత్రం సాధించింది. సంస్థ మంగళవారం ఉదయానికి 3,14,89,100 టన్నుల బొగ్గును వెలికితీయాల్సి ఉండగా 2,84,49,547 టన్నులను మాత్రమే ఉత్పత్తి చేసింది. ఇందులో భూగర్భగనుల నుంచి 79శాతం, ఉపరితలగనుల నుంచి 91 శాతం బొగ్గు ఉత్పత్తి అయింది.